

# మహర్షి ధ్యానం నాన్న
# పంచ జీవన వేదాలు

# మహర్షి ధ్యానం నాన్న
# పంచ జీవన వేదాలు

ప్రధమ ముద్రణ : 7 మార్చి, 2014

ప్రతులు : 10000

వెల : అమూల్యం

ముద్రణ : భావన ఆఫ్‌సెట్ ప్రింటర్స్, నెల్లూరు.
సెల్: 9494495968, 8121284326
E-mail: tabumedia26@gmail.com
srinivasulu.mulam15@gmail.com

ప్రతులకు : ధ్యానం నాన్న
మన ఇల్లు ఆశ్రమం
యస్.కోట, విజయనగరం జిల్లా.

నే దేవుడ్నికాదు

గురువునికాదు

స్వామిజీని అసలేకాదు

ఆధ్యాత్మిక తండ్రిని

మీ కన్నతండ్రి

మీకు జీవితాన్ని ఇస్తే

ఈ ఆధ్యాత్మిక తండ్రి ఇచ్చేది

ఆధ్యాత్మిక జీవితం

అంటే చింతన

# ఆధ్యాత్మిక వ్యక్తి

**మీ**రు అనుకునే దేవుడో, కుబేరుడో, బిల్‌గేట్సో, బఫేట్టో, లక్ష్మీమిట్టలో వచ్చి – నీవు వంద రూపాయి కాగితాలు వందలెక్కపెట్టు – అవి కట్టకట్టు అందులో ఒక వంద రూపాయలు నీవు తీసుకో, అలా నీ ఇష్టం రోజుకు ఎన్ని కట్టలు లెక్కపెడితే అన్ని వందలు తీసుకో. నీవు బ్రతికున్నంతవరకు అలా ఇచ్చే ఏర్పాటుచేస్తాను అంటే – అది కూడా ఎక్కువ రోజులు చెయ్యలేరు. ఎవరు ఎలాగ ఉంటారో చూడండి –
1) ఆశావాది (2) మేధావి (3)పెట్టుబడిదారుడు (4) తృప్తికలిగిన మనిషి (5) ఆధ్యాత్మిక వ్యక్తి (6) అత్యాశపరుడు

1) **ఆశావాది** – రాత్రి పగలు డబ్బు వ్యామోహంతో లెక్కపెట్టి నిద్ర, తిండి కూడా మాని లెక్కపెట్టి చాలా వందలు ప్రోగుచేసి – తిండి తినక, విశ్రాంతిలేక రోగముతో మరణిస్తాడు – కాని వెనకాలవాళ్లు అనుభవిస్తారు – అందుకే అంటారు పాచిపళ్ళవాడు సంపాదిస్తే బంగారుపళ్ళవాడు అనుభవిస్తాడు అని.

2) **మేధావి** – నీవు లెక్కపెట్టు అన్నావు నేనే లెక్కపెడుతున్నాను – ఇంకొక్కరిచేత లెక్కపెట్టించడంలేదు – ఇదిగో నే కనుగున్న డబ్బులు లెక్కపెట్టే మిషన్‌తో లెక్కపెట్టిస్తాను అని సుఖముగా ఎక్కువ లెక్కపెట్టించి ఎక్కువ సంపాదిస్తాడు.

3) **పెట్టుబడిదారుడు** – నేను మిషన్‌చేత లెక్కపెట్టడంలేదు – నే కొందరికి జీతం ఇచ్చుకొని లెక్కపెట్టిస్తాను. నాకు వచ్చిన దాంట్లో కొంత వాళ్లకిస్తాను – అని చాలా చాలా ఎక్కువ సంపాదిస్తాడు. ఇక్కడ శ్రమదోపిడి ఉంటుంది కానీ చాలా ఎక్కువ సంపాదిస్తాడు – కొందరిని తన అదుపు, ఆజ్ఞలో ఉంచుకుంటాడు – వారి బాధ్యతలు వహిస్తాడు.

4) **తృప్తి కలిగిన మనిషి** – తన అవసరాలకు, తన కుటుంబ సుఖమయ జీవితానికి ఎంత కావాలో అంత తనే లెక్కపెట్టి తృప్తిపడి ఇక నేను లెక్కపెట్టనవసరంలేదని మానేస్తాడు.

5) **ఆధ్యాత్మిక వ్యక్తి** – నే అనుభవిస్తున్న సత్యం అనుభవం నాకు చాలు. కానీ నాకు కనీస అవసరాలు ఉంటాయి. అలా అని నా సత్యం అనుభవం ఆపుకుని ఈ డబ్బులు లెక్కపెట్టేది చేయకూడదు. నే చెయ్యలేను, అవసరంలేదు – నే సత్యం అనుభవించి ప్రజలకు సత్యం అందించాలి – కావున ఈ 10 మంది కుటుంబాలకు ఈ డబ్బు లెక్కపెట్టే పని ఇవ్వండి. నా అవసరాలకు ఎంత అవసరమో వారిదగ్గర నే తీసుకుంటాను అంటారు.

6) **అత్యాశపరుడు** – కొన్నిరోజులు లెక్కపెట్టి నే వంద లెక్కపెడితే నాకు ఒక వందా? ఆ దేవుడికి 99 వందలా అలాకాదు నాకు ఆ 99 వందలు కావాలి అని కొన్నిరోజులు లెక్కపెట్టాక ఆపేసి లెక్కపెట్టడు. అంతవరకు సంపాదించిన దానితో పేకాటో, గుర్రం రేసులకో వెళ్ళి దేవుడు ఇస్తున్న దానికంటే ఎక్కువ సంపాదించాలి అనుకుంటాడు. దేవుడిచ్చినది వినియోగించుకోలేడు, ఉంచుకోలేడు – మీరు పై ఐదుగురిలో ఏ ఒక్కరు అయిన సంతోషమే – ఆరోవాడు కావద్దు.

# పంచ జీవన వేదాలు

సృష్టిలో అన్నీ ఏర్పడ్డాక చిట్టచివరన ఏర్పడ్డవాడు మానవుడు. సృష్టిలో ఉన్న అన్ని శక్తులు సూక్ష్మరూపములో మానవునిలో ఉన్నాయి. సృష్టి ఏర్పడడానికి కారణమైన సృష్టి మూలశక్తి చైతన్యం కూడ మానవునిలో ఉంది. మీ లోపలకి వెళ్లేకొలది సృష్టిలోని అన్ని శక్తుల అనుభూతిని మీరు పొందుతారు. అదే తపస్సు. తపస్సు అంటే శరీరం, మనస్సును శుద్ధి చేసుకొని మీలో ఉన్న సృష్టి శక్తుల యొక్క అనుభూతి పొందడం. అలాగే సృష్టిమూల శక్తి అనుభూతి అంటే జ్ఞానశూన్యం లేక పరమాత్మ అనుభూతిని పొందడం ఆధ్యాత్మికం. దీనికి నిర్దిష్టమైన విధానం అంటూ లేదు. ప్రపంచ దేశాలలో చాలా విధాలుగా వెళ్ళారు, మరీ ముఖ్యముగా భారతదేశములో తపస్సు ద్వారా, నామము ద్వారా, కీర్తన ద్వారా, యోగ సాధన ద్వారా, క్రియ ద్వారా, బోధ ద్వారా, భయం ద్వారా, విశ్వాసం ద్వారా, ఎవరి మానసిక స్థితిని బట్టి వారు తమ తమ విధానాలలో వెళ్ళి వారి అనుభూతుల ద్వారా, బోధనల ద్వారా, చూపుద్వారా, స్పర్శ ద్వారా, మౌనము ద్వారా సమాజమును రిలాక్స్ చేసినారు.

**మనిషి జీవితంలో సోపానాలు :**

1. ముక్తి
2. ప్రకృతి
3. ఆధ్యాత్మికం
4. సమాజం
5. వ్యక్తి

వీటిని ఈ శరీరం అనుభూతి పొంది మౌనంగా వ్రాసినదే పంచ జీవనవేదం. మీ అవగాహన కోసం చివర నుండి మొదలుపెట్టి మొదలకు చెబుతాను. బిడ్డలు నిశ్చింతగా అవగాహన చేసుకొని మీ జీవితములో మీ వీలు, మీ ఇష్టం మేరకు ఉపయోగించుకోండి.

# ముక్తి జీవన వేదం

నిజానికి, సత్యానికి చాలా తేడా వుంది. అలాగే సత్యము, నిజము అనుభవంలోకి వస్తే ఆధ్యాత్మికతను అనుభవించగలరు. నిజం మనిషి జ్ఞానేంద్రియములకు సంబంధించిన అనుభవం. చూచినది, విన్నది, రుచించినది, స్పర్శించినది, ఆలోచించినది అంటే చూచేవి, వినేవి, ఆలోచించేవి మనిషి, మనిషికి మారును. అంటే నిజం మారును. ప్రదేశం, కాలం, మనిషిని బట్టి మారును.

సత్యం జ్ఞానేంద్రియ రహితమైనది. చూడటం, వినడం, ఆలోచించడం లేకుండా స్వయముగ అనుభవించేది సత్యం. సత్యం నిజంలాగ మారదు. సత్యం ఒక్కటే సత్యం. కాలం, మనిషి, ప్రదేశాలకు అతీతంగా ఒకే అనుభవం ఉన్నదే సత్యం. అదే జ్ఞాన శూన్యం, అదే సృష్టిమూలశక్తి, అదే పరమాత్మ. మీరు నిజం, మీరు ఆత్మ అనేది నిజం మాత్రమే. పరమాత్మ సత్యం అదే సృష్టిమూలశక్తి.

ఈ సృష్టి అంతా సృష్టిమూలశక్తి శూన్యం, అంటే పరమాత్మ నుండి ఉత్పన్నమైనది. మనిషి తన ఆత్మనుండి (అంటే నిజం నుండి) పరమాత్మలో ఐక్యం అవ్వడమే. అంటే శూన్యం అనుభవించడమే పరమాత్మను చేరడం. ఆత్మ అంటే మీలో చైతన్యం, పరమాత్మ అంటే సృష్టిమూల చైతన్యం.

ఈ ప్రపంచములో నిజాలు మార్పు, రూపాంతరం చెందును, ఒకే విధముగ ఉండవు. ఇప్పుడు నిజం భవిష్యత్తులో అబద్దం కావచ్చును. ఇప్పుడు అబద్ధము భవిష్యత్తులో నిజంగా మారవచ్చును. కాని సత్యము మారదు ఎప్పుడూ ఒకే అనుభవమునకు వచ్చును. దేవుడు, మతాలు, వేదాలు, ఉపనిషత్తులు, మాయలు, మహిమలు నిజాలు. ఆయా కాలములో ప్రజలు వాటిని నిజాలుగ స్వీకరించవచ్చును, తరువాతి కాలములో వాటిని అదే ప్రజలు అబద్ధాలుగ భావించవచ్చును.

పాతతరం వారు నిజాలుగ ఒప్పుకొన్నది, ఇప్పుడు సైన్సుకు నిలబడదు కాబట్టి మీరు ఇది ఉపయోగంలేని అబద్ధముగా భావించవచ్చు. ఆయాకాలనుగుణంగా సమాజ అంశాలకోసం మనిషి ఏర్పరచుకొన్నది నిజం. సైన్సు నిజం, సైన్సుకు అందనిది సత్యం – అదే దైవం.

ఆ దైవాన్ని అదే మనిషి మరలా నిజంగా ఒప్పుకోకపోవచ్చు, అబద్ధముగా భావించవచ్చు. అలా నిజాలను, అబద్ధములను మార్చుకునే ఎన్నో మతాలు, ఎన్నో దైవాలు, ఎన్నో మహిమలను నిజాలుగా నమ్మడం, తరువాత ఆ నిజాలను ఒప్పుకోకపోడం. మరల క్రొత్త నిజాన్ని ఏర్పరచుకొని మరలా దానిని వదలి ఇంకొక్కటి నిజం అంటాడు ఎందుకంటే అది నిజం కాబట్టి, నిజం మారును.

దేవుళ్ళు, మతాలు, అవతారాలు, ఆధ్యాత్మిక వ్యక్తుల బోధలు ఆకాలంలో నిజంగా ఒప్పుకోవచ్చు. మరలా అదేమనిషి ఆ నిజాన్ని వ్యతిరేకించవచ్చు. కర్మకాండలు, బలిదానాలు, మూఢ నమ్మకాలు, మహిమలు, మాయలు ఇలాంటివి అన్నీ ఆ కాలములో నిజాలు. ఇప్పుడు వాటిని మూఢ నమ్మకాలు అనుకోవచ్చు.

వైద్యంలేని పూర్వకాలములో అంటువ్యాధులు మశూచి, జాడ్యం, కలరా వచ్చి ఊళ్ళకు ఊళ్ళు తుడుచుకుపోయినప్పుడు, ఆ జబ్బు ద్వారా వచ్చిన నష్టం కంటే మనుషులు మానసికంగా బలహీనమై పడ్డ దుఃఖము నుండి ఏర్పర్చుకొన్న నమ్మకమే గ్రామ దేవతలు. ఆ గ్రామ దేవతలు నన్ను, నా కుటుంబమును, నా ఊరిని రక్షించును అనే నమ్మకం, విశ్వాసంతో ప్రజలు వారి వారి ధర్మాలను నిర్వర్తించుకొనేవారు.

ఇప్పుడు ఆ రోగాలకు మందులు వచ్చినాయి కాబట్టి, ఇది మీరు ఇప్పుడు మూఢనమ్మకం అనుకోవచ్చు. అనుభవంలేని సత్యం కంటే నమ్మిన నిజం మేలు చేయును. నమ్మిన నిజం కంటే కీడు చేయని అబద్ధం ఎక్కువ ఉపయోగపడును.

ప్రపంచములో ఇన్ని మతాలు, దేవుళ్ళు, మతగ్రంధాలు, నీతులు ఇవి అన్నీ నమ్మిన నిజాలు. ఇవి ఆయా కాలం, ఆయా ప్రజల నమ్మకాలు వారికి అవి తాత్కాలిక ఉపశమనం కలిగించినాయి. పరిపూర్ణ ఉపశమనం సత్యం అనుభవించడం ద్వార పొందగలం.

గ్రామ దేవతలను సృష్టించుకొన్నాక కూడ మశూచి, కలరాల వ్యాప్తి ఆగలేదు, ఆ రోగాలు వచ్చినాయి. కాని ఆ రోగం రాకముందు నా గ్రామదేవత నాకు ఆ రోగం రాకుండా కాపాడును అనే నమ్మకంతో మనిషి బలహీనం కాకుండా తన ధర్మాలు నిర్వర్తించేవాడు. ఒక వేళ ఆ రోగం వస్తే, తాను మరణించేవరకు తన గ్రామదేవత కాపాడును అనే నమ్మకంతో బలహీనం కాకుండ జీవించేవాడు.

మరణ సమయం లిప్తకాలం. మరణం మనిషి గ్రహించేటంత కష్టం కాదు. కాని మరణానికి ముందు పడ్డ దుఃఖం నుండి రిలాక్స్ చేసేదే గ్రామదేవత నమ్మకం, విశ్వాసం.

మనిషి భయపడటం మరణం ముందే, మరణ సమయములో నీ మనస్సు ఉండదు. మరణించేటప్పుడు అహం ఉండదు. నీకు మరణ భయం ఉండదు. అంటే బ్రతుకుకు మరణానికి వ్యత్యాసం ఉండదు. నీ మనస్సుకు అందనివి నీ పుట్టుక, నీ మరణం.

నీ మనసు నశించి హృదయ అనుభవం పొందినప్పుడే నీ పుట్టుకకు ముందు మరణం తరువాతి అనుభవాలు గ్రహించగలరు, అవే ఆత్మానుభవాలు.

జ్ఞానశూన్యంలో, పరమాత్మ అనుభవంలో ఆ గత జన్మ అనుభవాలు, భవిష్యత్తు జన్మ అనుభవాలు కూడ ఉండవు. జ్ఞాన శూన్యంలో నీ గతజన్మ అనుభవాలు తుడుచుకుపోతాయి, ఈ జన్మ అనుభవాలు తుడుచుకపోతాయి అంటే వాసనలు తుడుచుకుపోతాయి. ఇక భవిష్యత్తు జన్మలు ఉండవు. అదే జ్ఞాన శూన్యం, అదే పరమాత్మ అనుభవం, అదే ముక్తి, అదే సత్యం.

మీరు ఇప్పుడు ఒక నిజాన్ని పట్టుకొని ఇదే మీ జీవిత ప్రామాణిక పరమాత్మ అంశం అనుకోవచ్చు ఆ నిజమే ప్రపంచ ప్రామాణిక అంశంగా ఉండాలి అనుకోవచ్చు. మీ నిజం ఈ సృష్టి ఉన్నంత వరకు ప్రామాణికంగా ఉండాలి అనుకోవచ్చు. ఇది ఖచ్చితంగా మారదు అని, ఇదే ఉండును, ఇదే కొనసాగును అని మీరు గట్టిగా నమ్మవచ్చు. అది నిజంకాబట్టి, తరువాత తరాలు ఈ నిజాన్ని ఒప్పుకోరు ఇంకో క్రొత్త నిజాన్ని పట్టుకోవచ్చు ప్రపంచములో ఇన్ని మతాల పుట్టుక ఇందరు దేవుళ్ళ పుట్టుక, దేవుళ్ళ అవతారాలు, మత గ్రంథాలు, ఋగ్వేదం, సామవేదం, యజుర్వేదం, అధర్వణవేదం వాటిలో ఉన్నవి నిజాలు. కానీ కాలం, ప్రదేశం, వ్యక్తుల అనుభవాలను బట్టి మారినాయి.

ఋషుల బోధనలు, దేవుడు, నీతులు, సంప్రదాయాలు నిజాలు. కానీ ఋషులు పొందింది సత్యం. సత్యమును ఎప్పుడూ మాటలలో వ్యక్తీకరించలేము. అంతర్గతంగా అనుభవిస్తూ ఆ సత్యమును ఆయాకాలము, ప్రదేశములో ఆయా వ్యక్తుల మధ్య జరిగిన అంశాలతో ఋషులు పొందిన సత్యమును భౌతికముగ

జరిగిన నిజాలతో పోల్చి చెబుతారు. వాల్మీకి వ్రాసిన రామాయణం నిజం, కానీ వాల్మీకి తపస్సు ద్వారా పొందిన అనుభవం సత్యం. వ్యాసుని భారతం నిజం, వ్యాసుడు పొందిన అనుభవం సత్యం. బుద్ధుడి అహింసబోధ నిజం, బుద్ధుడు పొందిన అనుభవం సత్యం. మహావీరుడి ధర్మబోధ నిజం, మహావీరుడు అనుభవించింది సత్యం. క్రీస్తు బోధ బైబులు నిజం, క్రీస్తు అనుభవించింది సత్యం. మహమ్మదు ప్రవక్త బోధ ఖురాన్ నిజం, మహమ్మదు ప్రవక్త పొందింది సత్యం.

ఈ శరీరం వ్రాసినవి నిజాలు మాత్రమే. ఈ శరీరం అనుభవించేది వ్రాయలేక, ఈ శరీరమునకు – మీకు తెలిసిన అంశాలతో ఈ శరీర అనుభవం అనుసంధానం చేసి వ్రాసింది. అంటే ఈ శరీరం పొందే జ్ఞాన శూన్యం వ్యక్తీకరించడానికి ఈ వ్రాసిన అంశాలను ఆధారం చేసుకున్నది ఈ శరీరం.

మీరు నిజం, ఈ ధ్యానం నాన్న నిజం, ఈ తండ్రి – బిడ్డ బంధం నిజం. ఇది మారవచ్చు, మిమ్ములను భవిష్యత్తులో ఈ శరీరం ఒప్పుకోకపోవచ్చు. మీరు ఈ శరీరమును ఒప్పుకోకపోవచ్చు. ఎందుకంటే మనం నిజం కాబట్టి. ఈ శరీరం ఇంకా ఉన్నతమైన నిజాన్ని చెప్పగలిగే స్థితి వస్తే మీరు ఆ నిజాన్ని స్వీకరించలేరని ఈ శరీరం మిమ్ములను దూరం పెట్టవచ్చు లేక ఇంకా ఉన్నతమైన నిజాన్ని వ్రాయలేక ఈ శరీరం మిమ్ములను దూరం పెట్టవచ్చు లేక ఇంకా ఉన్నతమైన నిజాన్ని వ్రాయలేక ఈ శరీరం ఇలా వ్రాయడం కూడ మానివేయవచ్చు. లేక మీరు ఈ శరీరములో వచ్చిన ఇంకా ఉన్నతమైన నిజాన్ని స్వీకరించే శక్తి లేక మీరు తప్పుకోవచ్చు. ఇది సహజం, ఎందుకంటే అది నిజం యొక్క స్వభావం.

కానీ ఈ శరీరం అనుభవిస్తున్న సత్యమును మీరు అనుభవిస్తే, ఈ శరీరం, మీరు ఎప్పుడూ వేరుకాము. అక్కడ మాట ఉండదు, గురువు – శిష్యుడు ఉండడు, తండ్రి – బిడ్డ ఉండడు. మన మధ్య ఉన్నది సత్యం, అదే జ్ఞానశూన్యం, అదే సృష్టిమూలం, అదే పరమాత్మ.

ఒక్కొక్క కాలంలో ఒక్కొక్క ప్రదేశంలో ఒక్కో మతం ఉన్నతం అవ్వడం, మరలా పతనం అవ్వడం ఎందుకు జరిగిందంటే అవి నిజాలు కాబట్టి. బుద్ధుడి బోధ నిజం. బుద్ధుడి అనుభవం సత్యం. సత్యమును కాలం, ప్రదేశం, సమాజం మరియు ఈ సృష్టిలో ఏ భౌతిక అంశం ప్రభావితం చేయలేవు. చివరకు సత్యం

కూడ తనను తాను ప్రభావితం చేసుకోలేదు. అంటే పరమాత్మ లేక జ్ఞానశూన్యం తననుతాను ప్రభావితం చేసుకోలేవు. ఎందుకంటే అవి సత్యాలు కాబట్టి. వాటికి మార్పు ఉండదు, మారవు, వేటి ప్రభావం వాటిపై ఉండదు. అదే సత్యం, అదే శూన్యం, అదే సృష్టిమూలం, అదే పరమాత్మ.

మీలో ఉన్న ఆత్మ చైతన్యమును సాధన ద్వారా సుషుమ్న ద్వారా సహస్రానికి పంపి సృష్టిమూల చైతన్యం, జ్ఞానశూన్యం పొందవచ్చు. అదే పరమాత్మ అనుభవం, అదే ముక్తి. అది పొందడానికి సాధన మార్గాలు చాలా వున్నాయి. నామం, కీర్తన, బీజాక్షరాలు, యోగ, క్రియ, ధ్యానం, తపస్సు, భక్తి లేక విశ్వాసం. వీటిలో మీకిష్టమైన ఏ సాధన ద్వారానైనా వెళ్ళవచ్చు. లేక భయం ద్వారా కూడా మీరు ఆత్మ నుండి పరమాత్మ అనుభవం పొందవచ్చు. ఆధ్యాత్మికములోకి వెళ్ళడానికి అందరికి ఇదే నిర్దిష్టమైన దారి అని చెప్పలేం. ఎవరి శారీరక, మానసిక అనుకూలతలనుబట్టి వారు వారికి తగిన సాధనను ఎంచుకొని దాని ద్వారా పొందుతారు.

ఆధ్యాత్మిక ప్రయాణం నిజం నుండి సత్యం వైపు వెళ్ళడానికి పై మార్గాలలో ఏదో ఒకదాని ద్వారా జరుగును. నీవు అబద్ధముతో ఉంటే నిజాన్ని గ్రహించలేవు. ఇక సత్యం అనుభవం ఎలా పొందుతావు? నేను పై సాధనలు ఏమీ చెయ్యలేను అంటే చెయ్యకు. కానీ నిజాలు విను, నిజాలు చదువు. అంటే గీతోపదేశమో, రామయణమో, భారతమా, భాగవతమో, బైబిలో, ఖురానో నిరంతరం పఠించండి, వినండి. మీలో ప్రతీ కణం నిజానికి అలవాటుపడును. నిజాలతో ఉండటం అలవాటు అయ్యి చివరికి మరణించే సమయానికైనా సత్యం అనుభవించగలవు. నీవు నిజంపై ఆధారపడితే సత్యమును అనుభవించగలవు.

దేవుడు, మతాలు, సైన్సు, సమాజం, బోధలు ఇవి నిజాలు. సృష్టిమూలం అనుభూతి సత్యం. అదే జ్ఞానశూన్యం, అదే పరమాత్మ. అహంకారంతో కూడిన నాస్తికత్వం కంటే, మూఢమైన భక్తి మేలు. మీ వాసనలు, మీ బాధలు, మీ కర్మలు, ప్రారబ్దకాలు నిజాలు. అవి మీ గత జన్మ, ఈ జన్మ నిజాలు. ఆ నిజాలకు, సత్యమునకు అసలు పోలికలేదు. సత్యంలో కర్మలు, ప్రారబ్దకాలు, మీ వాసనలు ఉండవు. సత్యం ఇవేమీ అంటని ఒక స్వయం అనుభవం. మీరు అనుకునే మీ జీవితంలో మీరు అనుకున్నవి, ఆలోచించేవి అన్నీ నిజాలే.

మీ మొదటి తాత ఏ దైవం, ఏ మతం లేకుండా ప్రకృతి శక్తితో జీవించాడు. ఆ తరువాతి తాత పంచభూతాలే దైవం ఈ సృష్టి నడకకు కారణం అని వాటిని పూజించి ఉండవచ్చు. తరువాతి తాత పరమేశ్వరుడు (శూన్యం), పరమాత్మ శ్రీమన్నారాయణుడు(శూన్యం, జ్ఞానశూన్యం, పరమాత్మ), దేవుడు అని పూజించవచ్చు. తరువాతి తాత బ్రహ్మ, విష్ణు, ఈశ్వరుడు త్రిమూర్తులను పూజించవచ్చు. తరువాతి తాత వెంకటేశ్వరుడు దేవుడని పూజించవచ్చు. వెంకన్నే దేవుడు ఇంక ఎవరూ దేవుడు కాదని పూజించవచ్చు. మీ నాన్న ఇంకొకర్ని దేవుడు అనవచ్చు, ఇతనే దేవుడు మరొకరు దేవుడు కాదని ఊగిపోవచ్చు. ఇప్పుడు మీరు శిరిడీ సాయి దేవుడు అనవచ్చు. మరో దేవుడు లేడు, ఈ సృష్టి అంతా సాయిమయం అనవచ్చు. మీ అబ్బాయి ఇది ఒప్పుకోకపోవచ్చు. మీ మనుమడు మరొకరిని దేవుడుగ స్వీకరించవచ్చు. ఇంకో కొత్త దేవుడిని సృష్టించుకోవచ్చు.

అంటే మీ మొదటి తాత ముక్తి పొందాడా – పొందలేదా? అతను పొందాడు అనుకొంటే అదే దేవుడ్ని మీరు కొనసాగించవచ్చు కదా లేక మీ తాతలు అనుకొన్న దేవుళ్ళతో ముక్తి పొందక పోయి ఉంటే ఇప్పుడు మీరు అనుకొనే దేవుడు ద్వారా కూడ ముక్తి పొందలేరుకదా? అంటే దేవుళ్ళను మార్చడం కాదు. ఏది ఆధ్యాత్మికం? ఏది అవసరం?

సత్యం గ్రహిస్తే మీరే దైవశక్తిని అనుభవించగలరు. అంటే అది మీకు తృప్తి ఇవ్వక ఇంకో దేవుడ్ని సృష్టించుకొన్నారు.

ఆ దేవుడు నిజం
మీ దేవుడు నిజం
మీ అబ్బాయి దేవుడు నిజం
మీ మనుమడి దేవుడు నిజం
సత్యం ఏది?
అది ఎప్పుడైనా ఆలోచించారా?
ఎంతకాలం ఇలా దేవుళ్ళను మార్చుతూ గడుపుతారు?
సత్యం అనుభవం ఎప్పుడు?

# ప్రకృతి జీవన వేదం

సృష్టిమూలము నుండి ఒక్కొక్కటి ఏర్పడుతూ ఈ సృష్టి అంతా ఏర్పడ్డాక చివరన సృష్టిలో ఉన్న అన్ని సూక్ష్మశక్తులతో ఏర్పడ్డవాడు మానవుడు. ఈ సృష్టి సహజ గుణం ప్రారంభించబడటం– సృష్టించబడటం – కొనసాగించబడటం – అంతం అవ్వడం – మరలా ప్రారంభించబడటం – సృష్టించబడటం – కొనసాగించబడటం – మరలా అంతం అవ్వడం. ఇలా కొన్ని కోట్లసార్లు జరిగింది, మరలా జరుగును. సృష్టిలోని ప్రతి అంశములో ఈ నాలుగు లక్షణాలూ ప్రధానమైనవి.

ఈ సృష్టిలో చివరన సృష్టించబడిన మానవుడిలో కూడా ఈ ప్రధాన లక్షణాలు ఉన్నాయి. అవే ప్రకృతి సహజ లక్షణాలు మానవుడి పరిణామదశలో మానవుడు చుట్టూ ఉన్న అంశాలను అనుకూలత చేసుకుంటూ తన ఆధిపత్యం భూమి, మొక్కలు, జీవాలపై అంటే చుట్టూ ఉన్న వాటిపై చేసి తన జీవనానికి అనుకూలం చేసుకొని తనకు అనుకూల దిశలో ప్రయాణం చెయ్యడం మొదలుపెట్టాడు.

ఈ పోరాటంలో తన ఆధిపత్యములో ఒక్కొక్కసారి అనుకూలత, ఒక్కొక్కసారి అననుకూలతలు ఎదురవ్వడంతో అలాగే చుట్టూ ఉన్న ప్రకృతి మానవుడి ఆధిపత్య వినాశనం భరించి భరించి ఏదో ఒక ఉపద్రవం రావడం దానితో మనిషి సంఘర్షణకు లోనయ్యి తన సహజ గుణమైన ప్రధాన లక్షణమైన నాలుగవ లక్షణం – అంతం అవ్వడం ఒప్పుకోక – భూమిపై మొక్కలపై, జీవులపై చివరికి తన మరణంపై యుద్ధం చెయ్యడం మొదలుపెట్టాడు. ప్రకృతిపై యుద్ధములో మనిషి సంఘర్షణతో మనిషికి మేధస్సు పెరిగింది. మేధస్సు నుండి ఈ భూమిపై తన ఉనికే ప్రధానము దానికోసం ఈ సృష్టిలో ఏ వినాశనమైనా చేస్తాననే స్వార్ధముతో భయం కూడా పెరిగిపోయినది. ఆ మేధస్సు, ఆ స్వార్ధం, ఆ ఉనికి, ఆ భయం నుండి వచ్చినవే దేవుళ్ళు, మతాలు, వేదాలు, నీతులు.

ప్రకృతిలో మిగతా అంశాలు అన్నీ ప్రకృతి సహజ గుణం అయిన ప్రారంభించబడటం – సృష్టించబడటం – కొనసాగించబడటం – అంతం అవ్వడం – అనే ప్రధాన లక్షణాలను ఒప్పుకోవడంతో అలాగే వ్యతిరేకించకపోవడంతో అవి ప్రకృతి చైతన్యంతో ఉన్నాయి. కానీ మనిషి ప్రకృతి సహజ గుణం అయిన

అంతం అవ్వడం ఒప్పుకోకపోవడంతో భయం, ఉనికి, స్వార్ధంతో తన సహజ లక్షణాలు అన్నీ కోల్పోయి దుఃఖం, నరకం, బాధలతో జీవిస్తున్నాడు అంటే మనిషి సహజ లక్షణమైన ప్రకృతి ప్రధాన లక్షణాలు ప్రారంభశక్తి - సృష్టిశక్తి - కొనసాగుశక్తిని ఆనందపడుతూ, అంతం అయ్యే శక్తిని ఒప్పుకోలేదు. ప్రారంభించబడతాను అనేది, అంతం అవడం అనేది ఒప్పుకోలేక, తిరిగి ప్రారంభం అవుతాను అనే జ్ఞానం కోల్పోయి తన ఉనికి ఇలాగే కొనసాగాలి అనే స్వార్ధం, భయంతో ప్రకృతి శక్తిని పూర్తిగా కోల్పోయాడు. ప్రకృతి సహజ లక్షణం ఒప్పుకొని ఉంటే ఎలాగూ మరలా ప్రారంభించబడతాడు లేక ప్రకృతి మూలశక్తిలోకి చేరిపోతాడు. అంటే మనిషి చైతన్యం కంటే ఇంకా ఉన్నతమైన చైతన్యంలో చేరతాడు. ఆ జ్ఞానం కోల్పోయి ఉనికి, స్వార్ధం, భయంతో జీవితాన్ని నరకం చేసుకొని ఇతను ఎంత ఎదురు ఈదినా అంతం అవ్వడం తప్పదు. కానీ అంతం అవ్వడానికి ముందు మనిషి సహజ చైతన్య లక్షణాలు నాలుగు ప్రధాన లక్షణాలు ప్రారంభం - సృష్టి - కొనసాగింపు - అంతం అవ్వడం అనే సహజ లక్షణాలు కోల్పోయి, ప్రారంభశక్తి కోల్పోయి, సృష్టి శక్తి కోల్పోయి, కొనసాగింపు శక్తి కోల్పోయి, నేను అంతం అవుతాను అనే దానిని ఒప్పుకోను అని దాని కోసమే పోరాడి ఆ ఉనికి, ఆ స్వార్ధం, ఆ భయం, ఆ దుఃఖము, ఈ నాలుగు లక్షణాలతోనే అంతమై తరువాత ఉత్పన్నమైనప్పుడు ఉనికి, స్వార్ధం, భయం, దుఃఖము ఈ నాలుగు లక్షణాలతోనే ఉత్పన్నమౌతూ ఇలా ఎన్నో జన్మలు ఎత్తుతూ జన్మజన్మకు దుఃఖాన్ని పెంచుకొంటూ జీవితం నరకం చేసుకొంటున్నాడు.

మొక్క నాలుగు ప్రకృతి ప్రధాన లక్షణాలతో అంతం అవుతుంది. మరలా ఆ నాలుగు ప్రకృతి ప్రధాన లక్షణాలతో సృష్టించబడుతుంది. మనిషి తన నాలుగు ప్రకృతి ప్రధాన లక్షణాలతో ఎందుకు ఉత్పన్నం అవ్వడం లేదు. దానికి ఉనికి, స్వార్ధం, భయం, దుఃఖం, ఇవే తన సూక్ష్మనాడీ వ్యవస్థలో చేరిపోయి మనిషి సూక్ష్మ నాడీ వ్యవస్థలో సహజంగా ఉండవలసిన ప్రారంభశక్తి, సృష్టిశక్తి, కొనసాగింపుశక్తి, అంతమయ్యే సహజ శక్తులు కోల్పోయి వాటి స్థానంలో ఉనికి, స్వార్ధం, భయం, దుఃఖం అనేవి చేరి జన్మ జన్మకు అవే పెంచుకొని పుడుతున్నాడు.

ప్రకృతిపరంగా మనిషి నానో నాడీ వ్యవస్థలో అంటే సూక్ష్మ నాడీవ్యవస్థలో సహజముగ ఉండేవి, ఉండవలసినవి ప్రారంభశక్తి, సృష్టిశక్తి, కొనసాగింపుశక్తి, అంతమయ్యే శక్తి. అవే ప్రకృతి మూలశక్తి సహజలక్షణాలు. సృష్టిలో ప్రతి అంశములో ఉండే, ఉండవలసిన సహజ లక్షణాలు ఈ ఉనికి, ఈ స్వార్థం, ఈ భయం, ఈ దుఃఖం లేకపోతే సృష్టిలో చాలా జీవరాశులు, పక్షులు, మొక్కలు అంతమైనట్లు మనిషి అంటే నేను అంతం అయితే ఎలాగు, అయ్య బాబోయ్ నా ఇల్లు, నా పొలం, నా బంగారం, నా టి.వి, నా ఇంటర్నేట్, అయ్య బాబోయ్ ఇవిలేని నా జీవితం నరకం, నేను ఒప్పుకోను, నేను ఇంకా ఉండాలి. ఇంకా అనుభవించాలి. ఈ సృష్టిలో నా ఉనికి (అంటే మనిషి) ఉండాలి, ఈ భూమిని నాశనం చేశాక చంద్రుడ్ని తరువాత మిగతా గ్రహాలను, సముద్ర అడుగు భాగము, ఆకాశంలో కూడా నా ఉనికి ఉండాలి. నే (అంటే మనిషి) అంతం అవ్వకూడదు. ప్రకృతి చాలా వరకు ఓపికగా నీ ఉనికి, నీ స్వార్థాన్ని, నీ భయాన్నీ, నీ దుఃఖాన్నీ ఆ నాల్గింటితో నీవు చేసేవి అన్నింటిని భరించి భరించి ఒకే ఒక దెబ్బ కొట్టును మొత్తం నీవు, ఈ సృష్టి అంతమై మరలా ఉత్పన్నమగును, మరలా సృష్టిలో అన్నీ ఏర్పడును. మరలా నీవు ఏర్పడతావు. అప్పుడు నీలో ఉనికి, స్వార్థం, భయం, దుఃఖం అనేవి లేకుండా ప్రకృతి ప్రధాన లక్షణాలు ప్రారంభశక్తి, సృష్టిశక్తి, కొనసాగుశక్తి, అంతం అయ్యే శక్తిని ఒప్పుకుంటూ జీవిస్తావు అదేదో ముందే ఒప్పుకొంటే సరిపొయ్యేది కదా. ఒప్పుకోవు ఎందుకంటే నీవు మనిషివి. మనిషి అంటే ప్రకృతికి దూరమై వినాశనశక్తిగా మారడం. మనిషి సృష్టించుకొన్న అభివృద్ధి వినాశన లక్షణం.

మీరు ఇప్పుడు ఇంకో అభిప్రాయం చెప్పవచ్చు. మనం (అంటే మనిషి) కనుమరుగు అవ్వకూడదు అంటే ఈ ఉనికి, ఈ స్వార్థం, ఈ భయం, ఈ దుఃఖం ఉంటేనే ఉంటాం అనే ప్రశ్న అడగవచ్చు. దయనోసార్లు ఒక్కసారే అంతం అవ్వలేదు. చాలా సార్లు అంతమై, చాలాసార్లు సృష్టించబడ్డాయి కానీ వాటిలో వినాశన లక్షణం పెరిగిపోవడంతో పూర్తిగా నశించినాయి. అయ్యో నశించిపోయినాయి అని మీరు బాధపడవచ్చు, నే (అంటే మనిషి) అంతమయిపోతాను అనే భయంతో. నీకు ఆ బాధ వద్దు. దయనోసార్లు భూమిపై

అంతమైనా, సృష్టిమూలశక్తిలో ఐక్యమైనాయి. ఇక్కడ లేకపోవచ్చు. మనిషి కూడా ఇలా ఉనికి, స్వార్థం, భయం, దుఃఖం పెరిగిపోతే చాలాసార్లు అంతమై చాలాసార్లు ఉత్పన్నమైనాడు. ఎందుకు మనిషి డయనోసార్లు లాగ పూర్తిగ అంతమవ్వలేదంటే దానికి కారణం ఋషుల తపఃశ్శక్తి.

కోటిమంది ఉనికికి, స్వార్థానికి, భయానికి, దుఃఖానికి ఒక ఋషి తపఃశ్శక్తి రక్ష. అలాగే ఈ సృష్టిలో ఎందరో ఋషులు తపస్సు చేసి ఈ భూమిపై ప్రకృతి శక్తిలో వారి తపఃశ్శక్తి ధారపోశారు. మీరు ఎన్ని వినాశనాలు చేసినా మీరు ఎన్నిసార్లు అంతమైనా మరలా పుట్టడానికి కారణం ఋషులే. లేకపోతే డయనోసార్లలాగే ఈ భూమిపై మనిషి ఉండేవాడు కాదు. ఆ ఋషులు చేసింది ఏమిటి? ఏది ఆధ్యాత్మికం, ఏది ప్రకృతి శక్తి, ఆ ప్రకృతి శక్తిని ఋషులు, దైవం, మతాలు, వేదాలు, నీతులతో ఎలా పొందుపర్చారు అన్నదే ఆధ్యాత్మిక జీవనం. అదే ఆధ్యాత్మిక జీవనవేదం. అది మూడవ జీవనవేదంలో చెబుతాను.

# ఆధ్యాత్మిక జీవన వేదం

ప్రకృతి జీవనవేదంలో ప్రకృతి ప్రధాన లక్షణాలు

1. ప్రారంభశక్తి
2. సృష్టిశక్తి
3. కొనసాగింపు శక్తి
4. అంతం శక్తి లేక లయ శక్తి

ఆ నాలుగు శక్తులు మనిషి వెన్నెముకలోని సూక్ష్మనాడీవ్యవస్థలో సూక్ష్మకేంద్రాలలో ఉన్నాయి. ఆ నాలుగు శక్తులతో మనిషి ప్రకృతి సహజ లక్షణాలతో జీవనం సాగించేవాడు. ఎప్పుడైతే మనిషికి ఉనికి, స్వార్థం, భయం, దుఃఖం వచ్చిందో, అప్పుడు తన సహజమైన ప్రకృతి సహజ శక్తులు కోల్పోయి జీవితం నరకం చేసుకొన్నాడు. ఋషులు మనిషి నరక జీవితం చూచి చింతన పడి మనిషి నరకాన్ని తొలగించడానికి తపస్సు చేసి వారు ముక్తిపొంది, మనిషిలో ప్రకృతి శక్తి నింపడానికి దైవాలుగా ప్రకృతి శక్తిని – పంచభూతాల శక్తిగాను, దైవశక్తిని – షట్చక్రాలు శక్తిగాను, దైవ అంశాలుగాను, యజ్ఞములు, హోమాలు, పూజలతో అనుసంధానం చేసి, మీలో ఉన్న ఆ దైవ శక్తులను చైతన్యం చేసే అంశాలు ఏర్పాటుచేశారు.

దైవ నామస్మరణ, బీజాక్షరాలు, కీర్తనలు, యోగ, క్రియ, ధ్యానం, తపస్సు, యజ్ఞాలు, హోమాలు, వ్రతాలు, పూజలు, ప్రార్ధనలు మనిషిలో ప్రకృతి సహజ లక్షణాలు అయిన 1. ప్రారంభ శక్తి 2. సృష్టి శక్తి, 3. కొనసాగింపు శక్తి. 4. అంతం లేక లయ శక్తి పరిపూర్ణంగా చైతన్యం చెయ్యడం ఆధ్యాత్మిక జీవనం. ఈ ఆధ్యాత్మిక అంశాలతో మనిషికి ఈ ఆధ్యాత్మిక సోపానాలు జరుగును.

1. శ్వాసశుద్ధి
2. జలశుద్ధి
3. ఆహారశుద్ధి
4. నిద్రశుద్ధి
5. మనసుశుద్ధి

6. ఆసనం శుద్ధి (అంటే స్థిరత్వం)
7. ఏకాగ్రత శుద్ధి (మీలో ఏకత్వమును తీసుకురావడం)
8. ధ్యానశుద్ధి
9. సమాధిశుద్ధి
10. జ్ఞానశూన్యం శుద్ధి

ఈ 10 సోపానాలు జరిగితే దశావతారాలు మీలో జరిగి ఆధ్యాత్మిక పరిపూర్ణత పొందుతారు. ఆ పరిపూర్ణత వస్తే ఆధ్యాత్మికంలో చివరి అంశం సమాజము కోసం నిరంతరం చింతన పడుతూ మౌనంగా, అజ్ఞాతముగ జ్ఞానశూన్యంలో ఉండటం. అదే ఋషి విధానం.

1. పవిత్రత
2. జ్ఞానశూన్యం
3. సమాజం పట్ల చింతన
4. తపన

ఆ నాలుగు ప్రధాన అంశాలుగా సేవచేస్తారు.

**1. శ్వాస శుద్ధి:-** ఎడమ శ్వాస ఒక్కటే నిరంతరం జరిగితే తమోగుణం (సోమరితనం, అసమర్ధత). కుడి శ్వాస ఒక్కటే నిరంతరం జరిగితే రజోగుణం (అహంకారం, స్వార్థం, ఆధిపత్యం). రెండు శ్వాసలు సమానంగా జరిగితే సత్వగుణం (భగవంతుని అనుభూతిలో ఉండటం)

కుడి శ్వాస సూర్యనాడి. సూర్య అంటే వెలుగు, కార్యం, పని. పని చేసేటప్పుడు సూర్య నాడి శ్వాస పరిపూర్ణంగా జరిగితే మీరు ఆ పనితో 100% ఉండగలరు. పరిపూర్ణ ఫలితం వచ్చును. పని తృప్తికలుగును.

ఎడమ శ్వాస చంద్రనాడి. చంద్ర అంటే విశ్రాంతి. మీరు పని అవ్వగానే విశ్రాంతిలోకి రావాలి. అప్పుడే మీరు పని వత్తిడి నుండి విశ్రాంతి పొందుతారు. మీకు తరువాత పనిచేసే శక్తి వచ్చును.

రెండు శ్వాసలు సమానముగ జరిగితే పనీకాదు, విశ్రాంతికాదు, సుషుమ్న శక్తి. అది దైవశక్తి చార్జిచేయును. మీలో మూలాధార శక్తి (ప్రారంభ శక్తి) అంటే వినాయక శక్తి చార్జి అయ్యి మీ జీవితములో ఎప్పుడూ క్రొత్త పని చక్కగా ప్రారంభించగలిగే శక్తి చార్జి అగును.

అలాగే సృష్టి శక్తి అంటే బ్రహ్మ, సరస్వతి శక్తి. మీరు మీ ధర్మాలను బయట వనరులతోఎలా సృష్టించుకోవాలి అనే శక్తి మీకు స్వయంగా వచ్చి మీరు సృష్టించుకొంటారు.

అలాగే స్థితిశక్తి అంటే కొనసాగింపు శక్తి. మీరు పనిని ప్రారంభించి, సృష్టించుకొని, స్థితిశక్తితో సంపదను ఏర్పరుచుకొని కుటుంబ, సంస్థ, సమాజ ధర్మాలు నిర్వర్తిస్తారు ఇదే విష్ణువు - లక్ష్మీ శక్తి.

అంతం శక్తి (లయం శక్తి). ఒక అంశం ప్రారంభించడం ఎంత ముఖ్యమో సరైన సమయంలో ముగించడం అంతే ముఖ్యం. అదే ఈశ్వరుడు పార్వతి శక్తి, లయ శక్తి లేకపోతే ఏదో చిన్నది చేసి, సాధించి ఇదే ఉన్నతం అని అహం నెత్తికెక్కి పరిమితం అయిపోతావు. మీకు క్రొత్తది ప్రారంభించే శక్తిరాదు. మీకు జీవితాంతం నాలుగు శక్తులు మీ వెన్నెముక సూక్ష్మ నాడీవ్యవస్థలో చైతన్యం అవ్వాలి. రెండు శ్వాసలు రోజంతా సమానమైతే ఆ నాలుగు శక్తులు వాటికి అవే అయా సమయాలలో చక్కగా చార్జి అయ్యి మీలో దైవశక్తులు చైతన్యం అయ్యి మీరే ధర్మాలు నిర్వర్తించుకొనే శక్తులు స్వయంగా వచ్చును. అదే శ్వాస శుద్ధి. రెండు శ్వాసలు సమానమైతే రోజులో 24 గంటలూ ఆయా సమయాలలో ఆ దైవ శక్తులు ఇలా చార్జి అగును.

తెల్లవారుఝామున 3 గంటల నుండి 9 గంటల వరకు ప్రారంభశక్తి, మూలాధారశక్తి, వినాయక శక్తి చార్జి అగును.

ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు సృష్టి శక్తి, బ్రహ్మ, సరస్వతి శక్తి చార్జి అగును.

మధ్యాహ్నం 3 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు స్థితిశక్తి, విష్ణువు - లక్ష్మీ శక్తి చార్జి అగును.

రాత్రి 9 గంటల నుండి తెల్లవారుఝామున 3 గంటల వరకు లయశక్తి, అంటే అంతం శక్తి ఈశ్వరుడు - పార్వతి శక్తి చార్జి అగును.

అలా ప్రతి రోజు, ప్రతి నెల, ప్రతి సంవత్సరం మీ జీవితం అంతా అలా జరిగి మీ ధర్మాలను ఆ దైవ శక్తులతో మీరే నిర్వర్తించుకొంటారు. మీ శరీరములో ప్రతికణం శ్వాసతో శుద్ధి అయ్యి నిరంతరం చైతన్యం వచ్చును.

**2. జల శుద్ధి :-** మీ శరీరములోని ప్రతి కణం జలంతో శుద్ధి అగును. రెండు శ్వాసలతో జలము తీసుకొంటే ఆ నాలుగుశక్తులు చైతన్యం అగును. ఆయా దైవాలను అభిషేకించడం అంటే రెండు శ్వాసలతో జలం తీసుకోవడం.

**3. ఆహార శుద్ధి :-** ఆహారాన్ని బట్టి శరీరతత్వం ఉండును.
హైడ్రోజన్ శరీరాలు : క్షార ఆహారం ఎక్కువ తీసుకొంటారు. కందమూలాలు, ఆకులు, అలములు, తీపి పండ్లు, పాలపదార్ధములు, వీరు ఋషులు.
ఆక్సిజన్ శరీరాలు : ఆమ్ల ఆహారం 40%, క్షార ఆహారం 60% తీసుకొంటారు. వీరు కార్యశూరులు, యుగపురుషులు.
కార్బన్‌డయాక్సైడ్ శరీరాలు : వీరు పూర్తిగా ఆమ్ల ఆహారం ఎక్కువ తీసుకొంటారు. వినాశన లక్షణాలు ఎక్కువ ఉంటాయి.
మీ శరీరం, మనసు అనుకూలతను బట్టి మీరు ఆహారం తీసుకోవాలి. ఏదైన ఎక్కువ తీసుకొంటే ఆహారం విషం. తక్కువ తీసుకొంటే నీరసం. సమానముగ తీసుకొంటే అమృతం.
ఈ శరీరం అతి ఉపవాసములు చేసి న్యూట్రిషన్ ఇబ్బంది పడ్డాది. ఈ శరీరం అనుభవముతో చెబుతున్నది "సమ ఆహారం తీసుకోండి"

**4. నిద్ర శుద్ధి :-** మీరు ఎడమ శ్వాసతో నిద్రలోకి వెళ్ళితే మీకు శారీరకంగా, మానసికంగా విశ్రాంతి వచ్చును. కాని మీలో అంతర్గత బ్రైను విశ్రాంతి పొందదు. అందుకే భయం కలిగించే కలలు వస్తాయి. సుషుప్త నిద్రలోకి వెళ్ళలేరు అంటే కలలు లేని ఘాడమైన నిద్ర రాదు. అదే కుడి శ్వాసతో నిద్రలోకి వెళ్ళితే నిద్ర ఎంతకూ రాదు, కళ్ళుమూతలు పడవు.
ఉదయం నుండి పని వత్తిళ్ళ ఆలోచనలే ఉండును, అటు ఇటూ దొర్లుతారు. అదే రెండు శ్వాసలు సమానం చేసి నిద్రపోతే సుషుప్త నిద్ర, దైవనిద్ర, కలలు లేని ఘాడమైన నిద్ర, దైవ శక్తులుచార్జి అయ్యే నిద్ర. అది మీ మనస్సు, శరీరమును శుద్ధిచేయును.

**5. మనసు శుద్ధి :–** ఎడమ శ్వాస తమోగుణ ఆలోచనలు. కుడి శ్వాస రజోగుణ ఆలోచనలు. రెండు శ్వాసలు సత్వగుణ ఆలోచనలు. మనస్సు శుద్ధి అగును. మీ కష్టాలు, బాధలు, అవమానాలు, గాయాలు, భయాలు శుద్ధి అగును. ప్రశాంతత వచ్చును.

**6. ఆసనం శుద్ధి (స్థిరత్వం):–** ఎడమ శ్వాస జరిగితే కూర్చుంటే కునికిపాట్లు పడతారు. ప్రతి ధర్మంలో కుడిశ్వాస అయితే ఆ పనితో ఉండలేరు. శరీరము లేపేసును,అటు ఇటు తిరుగుతారు. దేనితోను స్థిరముగ ఉండలేరు. రెండు శ్వాసలు సమానముగా జరిగితే, మీరు ఏది చేస్తే దానితో ఉంటారు, స్థిరత్వం వచ్చును.

**7. ఏకాగ్రత శుద్ధి:–** నామం, దేవుడు, యోగాసనాలు, క్రియ, తపస్సు, శ్వాస, పూజ, వ్రతం, హోమాలు, యజ్ఞాలతో మనిషికి ఏకత్వం వచ్చును. ఆ ఏకాగ్రతలో మీ నాలుగు దైవశక్తులు చైతన్యం అగును. మీ ధర్మాలను మీరే స్వయముగ తీర్చుకోగలరు.

**8. ధ్యాన శుద్ధి:–** పైవి అన్నీ జరిగిన తరువాత మీకు ధ్యానం వచ్చును. మీకు అన్ని ఆలోచనలు ఆగి ప్రశాంతత వచ్చి మీలో దైవశక్తులు శాంతి పొంది మీరు నిర్మలముగ మీ ధర్మాలు నిర్వర్తిస్తారు. ధ్యానంలో ఆలోచనలు పూర్తిగా ఆగుతాయి.

**9. సమాధి శుద్ధి:–** మీ అంతర్గత బ్రైనులో ఉన్న వాసనలు ఒక్కొక్కటి వదిలివేయును. తరువాత ఆ వాసనలు తొలగును. ఆ వాసనలు ఇబ్బంది పెట్టవు.

**10. జ్ఞాన శూన్యం శుద్ధి:–** ఏమీ ఉండదు, చూసేవాడు ఉండడు, చేసేదేమీ ఉండదు, వినేది ఉండదు, ఏమీ ఉండదు. అలా శూన్యం నిరంతరం పొందుతారు. అదేపరమాత్మ అనుభూతి.

పెండ్లి అయ్యేవరకు ఆధ్యాత్మికముగ మీరు ఎదగాలి. పెండ్లి అయ్యాక కుటుంబాన్ని అభివృద్ధిపరచాలి. మీ కుటుంబ అభివృద్ధి తృప్తినిచ్చాక సమాజ అభివృద్ధికి మీ ఆధ్యాత్మికం ఉపయోగపడాలి. అప్పుడే పరిపూర్ణ జీవితం. గృహస్తుకి మొదటి ఏడు శుద్ధులు అవసరం. ఋషికి పది శుద్ధులూ ఉండాలి. ఈ పదీ పొందాక సమాజము కోసం మీరు జీవితాంతం చింతన పడతారు. అదే ఆధ్యాత్మికంలో అంతిమ లక్ష్యం.

# సమాజ జీవన వేదం

సమాజములో నీ పాత్ర ఎలా ఉంది, నీలో సమాజమును బాధ పెట్టే మాటలు, చూపులు, చేతలు ఉన్నాయా లేక సమాజములో మీరు బాధపడే విధంగా ఉన్నారా, అని నిరంతరం చూసుకోవాలి. నా బ్రతుకునే చూసుకొంటున్నానా, కుటుంబం బ్రతుకు చూస్తున్నానా, సమాజ మనుగడకు బ్రతుకుతున్నానా అనేది ఎప్పుడూ చూసుకోవాలి. వ్యక్తి కంటే కుటుంబం ఉన్నతం, కుటుంబం కంటే సంస్థ ఉన్నతం, సంస్థ కంటే సమాజం ఉన్నతం. మీ జీవితంలో ఆ ప్రాముఖ్యత గ్రహించాలి.

సమాజములో మనిషిపై ఈ నాలుగింటి ప్రభావం ఎక్కువ ఉండి సమభావం కోల్పోతాడు.

1. మతం
2. ప్రాంతం
3. కులం
4. రాజకీయం

**మతం :-** నా మతమే ఉన్నతం. నా మతమే ఈ ప్రపంచమంతా ఉండాలి. పరమతాన్ని ఒప్పుకోను అనే భావాలతో మీరు చాలా శక్తిహీనులౌతారు. నీ మతములో నీవు ఎంత మంచి ఉన్నదని అనుకొంటున్నావో, ఇతరులు వారి మతాలలో అంతకంటే ఎక్కువ మంచి ఉంది అని అనుకొంటారు. సమాజములో ఒక వ్యక్తి మంచితనానికి, యోగ్యతకి మతం ద్వారా ఎక్కువ సుగుణాలు ఆపాదించడం, ఎక్కువ దుర్గుణాలు ఆపాదించడం చేయవద్దు. అలా చేస్తే నీవు చాలా నష్టపోతావు. నీలో దైవశక్తులు కోల్పోయి బలహీనుడౌతావు, అసమర్థుడవౌతావు, స్వార్ధపరుడౌతావు.

సమభావం పెంచుకో. ప్రపంచమంతా నీ మతమే వ్యాప్తిచెందితే ఇప్పుడు ఉన్న పరమత కొట్లాటలు తగ్గి నీ మతములో అంతర్గత కొట్లాటలు పెరుగును. ఎలా ఉండే వాటిని అలా ఉంచి నీవు ఏమి స్వీకరిస్తున్నావు, ఏమి ఆచరిస్తున్నావు, ఏమి అనుభవిస్తున్నావు, ఏమి చేస్తున్నావు అనేది చూడు. లేకపోతే మూల్యం చెల్లించాలి. నీ మతంపై అకారణ ప్రేమ ఇతర మతాలపై అకారణ ద్వేషం వద్దు. అందులోని నిజాలు స్వీకరించు.

**ప్రాంతం :–** ప్రతి వ్యక్తి సమాజములో ప్రాంతీయ అసమానతలు తొలగించాలి. ఆ బాధ్యత ప్రతి ఒక్కరిది. లేకపోతే మన ప్రాంతం ఒక్కటే అభివృద్ధి చెందాలి అని, ఇంకో ప్రాంతాన్ని నాశనంచేస్తే ఎప్పుడో ఒకప్పుడు మూల్యం చెల్లించాలి. ఎన్నో యుద్ధాలు, ప్రపంచ యుద్ధాలకు కారణం ఇదే. ప్రాంత సమభావం కోల్పోవడంవల్ల ఇన్ని యుద్ధాలు వచ్చాయి. నీ ప్రాంతంపై అకారణ ప్రేమ, ఇతర ప్రాంతాలపై అకారణ ద్వేషం నిన్ను బలహీనపరుచును.

**కులం:–** మనిషి వృత్తికోసం, సౌలభ్యం కోసం ఏర్పాటు చేసుకొన్నది కులం. కులం నిజం కాదు. మనిషి నిజం, కులం అబద్దంతో కూడిన స్వార్థం. లేని ఈ కులం కారణంగానే సమాజములో ఎన్నో అసమానతలు, ఎన్నో ఆధిపత్యాలు, దౌర్జన్యాలు, అహంకారాలు వచ్చినాయి. ఆధిపత్యం చేసినవారు ఏమీ పొముకోలేదు. అహం పెంచుకొని వారికివారే అంతం అయినారు. కులం అంశంలో నలిగిన వారే బాధలు పడి పడి, శక్తి పుంజుకొని ఉన్నతులైనారు. ఏ చరిత్ర తీసుకొన్నా హాని చేసినవాడు వాడి పతనం వాడే సృష్టించుకొన్నాడు. నలిగినవారు ఆ సంఘర్షణ నుండి శక్తిని పుంజుకొని ఆదర్శం అయ్యారు. గత తరాల తప్పులకు ఈ తరం మూల్యం చెల్లించాలి. ఈ తరం తప్పులకు రాబోవు తరాలు మూల్యం చెల్లించాలి. మనం ఇప్పుడు ఆధిపత్యం చేస్తున్నాం అన్నవారంతా మూల్యం చెల్లించాలి. గతంలో ఆధిపత్యం చేసినవారంతా ఇప్పుడు మూల్యం చెల్లిస్తున్నారు. ఒక వ్యక్తి మంచితనం అతని యోగ్యత కులంతో పరిమితం చేయకు. దానితో నీలో సమభావం కోల్పోయి చరిత్రహీనుడవౌతావు. నీవు అనుచరుడుగ మిగులుతావు. నీవు ఏదీ సాధించుకోలేవు. నీది ఆదర్శ జీవితం అవ్వదు. నీ కులంపై అకారణ ప్రేమ, ఇతర కులాలపై అకారణ ద్వేషం నిన్ను శక్తిహీనుడ్ని చేయును.

**రాజకీయం :–** ప్రజాస్వామ్య దేశంలో ప్రజలపై పాలించే (రాజకీయనాయకుల) వారి పాత్ర వున్నది. దానివలన మీ పై ప్రత్యక్షంగానో, పరోక్షంగానో రాజకీయ ప్రభావం పడును. రాజకీయపార్టీల, నాయకుల సిద్ధాంతాలు ఎంత, ఆచరణ ఎంత, సేవ ఎంత అనేది చూడండి. దానిని బట్టి నీవు, నీ కుటుంబం, సమాజం మూల్యం చెల్లించాలి. నీకు ఇష్టమైన రాజకీయ నాయకుడ్ని ఉన్నతుడినిచేసి, అతని లోపాలు కప్పిపుచ్చి, ఇతర నాయకుల ఉన్నతిని కప్పిపుచ్చి వారి లోపాలను ఎత్తి చూపితే, నీవు బలహీనపడతావు. నీవు సమభావం కోల్పోతావు. నీకు ఇతరులను విమర్శించాలి అనిపిస్తే ముందు నిన్ను నువ్వు విమర్శించుకో, నీ కుటుంబాన్ని

విమర్శించుకో, నీ కులాన్ని విమర్శించుకో, నీ ప్రాంతాన్ని విమర్శించుకో, నీ మతాన్ని విమర్శించుకో, నువ్వు ఇష్టపడే రాజకీయ నాయకుడిని విమర్శించుకో.

నీవు నిన్ను ఉన్నతుడ్ని చేసుకొనేలాగ మాట్లాడాలంటే పరులను ఉన్నతం చెయ్యి. ఇతర ప్రాంతాలను ఉన్నతం చేసే మాటలు మాట్లాడు ఇతర మతాలను ఉన్నతం చెయ్యి. ఇతర కులాలను ఉన్నతం చేసి మాట్లాడు నీవు ఒక పార్శ్వంలో ఉంటే నీవు బలహీనపడతావు. నీవు ఏమి పై వాటిని ప్రభావితం చెయ్యలేవు, వాటిలో కొట్టుకుపోతావు నీ అభివృద్ధికి అవే ఆటంకాలు అవుతాయి. సమాజం అంటే నీ ఒక్కడి జీవితమే కాదు, చాలా మంది జీవితాల సముదాయం. నీ అభివృద్ధి అని సమాజములో సమభావం కోల్పోతే ఎంతో మూల్యం చెల్లించాలి. చాలామంది చెల్లించారు. నీ ఒక్కడి బ్రతుకు కాదు చాలామంది బ్రతుకును నీవు ఆకాంక్షించాలి.

ప్రత్యక్షంగా పరోక్షంగా ఈ నాలుగింటియందు నీవు సమభావం లేకుండా ఎందరు గురువుల్ని చూచినా, ఎన్ని బోధనలు విన్నా, ఎందరి దేవుళ్ళను దర్శించినా, ఎన్ని గ్రంథాలు చదివినా ఉపయోగంలేదు. నిన్ను నీవు చూచుకో ఇతరుల యందు నీ ఆలోచన, మాట, చేత, ఏ తీరుగా ఉందో నిన్ను నువ్వు గమనించు, అప్పుడే నీవు సమాజములో ఉత్తమ వ్యక్తి కాగలవు.

నీవు మతం, ప్రాంతం, కులం, రాజకీయం అంశాలతో నందిని పంది చెయ్యడానికి ప్రయత్నించవద్దు. అలా చేస్తే నీవే బలహీనం అవుతావు. నీవు సమాజమునకు ఉపయోగపడలేవు. కుటుంబానికి ఉపయోగపడలేవు. చివరికి నీకు నీవు ఉపయోగపడవు. అకారణ ప్రేమ అకారణ ద్వేషం వద్దు. సమభావం ఉన్నతం. మీ ఆలోచనలు, మాటలు, చేతలు అతి పాజిటివ్ తప్పు, అతి నెగిటివ్ తప్పు, మీ ఆలోచనలు, మాటలు, చేతలు రైట్‌వే మంచిది ప్రత్యక్షంగా, పరోక్షంగా.

లౌక్యం మీరు మంచిది అనుకొంటారు, లౌక్యం ప్రత్యక్షంగా ఒక విధంగాను పరోక్షంగా ఒక విధంగాను ఉండును. రైట్‌వే ఆలోచన ప్రత్యక్షంగాను పరోక్షంగాను మిమ్ములను ఉన్నతంచేసి శక్తివంతులను చేయును.

రైట్‌వే ఆలోచన మీకు ఎప్పుడు వచ్చునంటే మీరు మతం, ప్రాంతం, కులం, రాజకీయ ప్రభావాలకు లోనుకానప్పుడే రైట్‌వే ఆలోచనలు, మాటలు, చేతలతో ఉంటారు. లౌక్యం వద్దు అనుకొనే ఆధ్యాత్మిక వ్యక్తులు మౌనం వహిస్తారు. ఆధ్యాత్మిక వ్యక్తులు సమ ప్రేమ కోసం మౌనం వహించి ధ్యానం, చింతన చేస్తారు.

# వ్యక్తి జీవనవేదం

ఎవరికివారు వ్యక్తిగత స్వేచ్ఛ కావాలి అనుకొంటారు. స్వేచ్ఛ అంటే నాకు పరిమితులు లేవు. నా ఇష్టం అనుకొంటారు. నేను ఏమి ఆలోచించినా, ఏమి చేసినా నా ఇష్టం అనుకొంటారు. స్వేచ్ఛలో చాలా పరిమితులు ఉంటాయి. నీవు నీకు పరిమితులు, హద్దులు పెట్టుకొని ఇతరుల స్వేచ్ఛకు భంగం కలిగించని జీవితము, నీపై ఇతరుల ఆదిపత్యంలేని జీవితము స్వేచ్ఛా జీవితము.

మీరు స్వేచ్ఛ కోరుకుంటున్నారు అంటే మీలో చాలా సుగుణాలు, అలాగే చాలా సమభావం ఉంటేనే మీరు స్వేచ్ఛగా ఉండగలరు. బలహీనులు, క్రమశిక్షణ రహితమైన వారు భౌతిక స్వేచ్ఛ కావాలి అనుకొంటారు. భౌతిక స్వేచ్ఛ కంటే అంతర్గత స్వేచ్ఛ చాలా ముఖ్యం. అదిపూర్తిగా మీ పైనే ఆధారపడి వుంది. స్వేచ్ఛకు ముందు నీ జ్ఞానేంద్రియాలపై అదుపు ఉండాలి. ఏమి చూస్తున్నావు ఏమి వింటున్నావు, ఏమి ఆలోచిస్తున్నావు, ఏమి చేస్తున్నావు, ఏమి పొందుతున్నావు అనే సత్యం మీ గమనములో ఉండాలి. అదుపులో ఉండాలి. గత అనుభవమును దాని ఫలితాలను ఎప్పుడూ అవగాహనతో ఉండాలి.

మీ జ్ఞానేంద్రియాలను ఇష్టానుసారంగా వదలి మీరు స్వేచ్ఛ కోరుకొంటే అది అయ్యేపనికాదు. మీరు ఇతరుల స్వేచ్ఛను భంగపరచిన వారు అవుతారు. మీరు ఎందరో స్వేచ్ఛను హరిస్తారు. మీరు ఎడమ శ్వాసతో ఉంటే తమోగుణ సంబంధమైనవి చూడటం, వినడం, మాట్లాడటం, ఆలోచించడం చేస్తారు. ఈ తమోగుణ లక్షణాల వలన మీరు బలహీనులై మీరు ఇతరుల ఆధిపత్యములోకి వెళ్ళి మీ స్వేచ్ఛను పూర్తిగా కోల్పోయి మీ జీవితాన్ని దుఃఖం చేసుకొంటారు.

అదే నిరంతరం కుడి శ్వాసతో ఉంటే మీ చూపు, వినడం, ఆలోచన, మాట, చేత రజోగుణ పూరితమై ఉంటాయి. ఇతరుల స్వేచ్ఛను హరిస్తారు. మీది ఇతరులను లొంగపర్చుకొనే స్వభావం, ఆధిపత్యం, అహం. అదే రెండు శ్వాసలు సమానమైతే మీరు సమభావంతో ఉండి అన్ని ధర్మాలు నిర్వర్తిస్తూ మీ స్వేచ్ఛను కాపాడుకొంటూ ఇతరుల స్వేచ్ఛకు భంగం కాకుండా జీవిస్తారు. భౌతికమేకాదు అంతర్గతముగ ఈ సృష్టి అంత స్వేచ్ఛగా, స్వచ్ఛంగా ఉంటారు. మీరు గదిలో

ఉన్నా అనంత సృష్టిలో ఉన్నంత స్వేచ్ఛ. మీరు ఒకరి కింద పని చేసినా సృష్టి మూలశక్తి, జ్ఞాన శూన్యం అంత స్వేచ్ఛలో ఉండాలి. అది స్వేచ్ఛ. స్వేచ్ఛ శారీరకముగ, మానసికంగా, అంతర్గతంగా స్వేచ్ఛగా ఉండాలి. భౌతిక ఉదాహరణ మీరు తోటి మనిషికి ఎవరికైనా చెప్పులు తొడగండి, కాళ్ళు పట్టుకొండి కానీ వారి ఆధిపత్యం మీ పై లేకుండా చూసుకోండి. స్వేచ్ఛ అంటే సమాజమును వ్యతిరేకించడం వృత్తిలో వ్యవహారాలు చేయలేక సమర్థత లేక అసమర్థుడై, నాకు స్వేచ్ఛలేదు, నేను పని చెయ్యెను, మారతాను, ఇక్కడ ఉండను, ఇంకో చోటికి వెళతాను అనడంకాదు. మార్చవలసింది ప్రదేశం, వ్యక్తులను కాదు. నీ జ్ఞానేంద్రియాలపై అదుపులేక, శక్తిలేక, సమర్థత లేక స్వేచ్ఛ అని, స్థిరత్వం కోల్పోయి స్త్రీస్కుల లక్షణాలు, స్వేచ్ఛ, నా ఇష్టం, నా బ్రతుకు నేను ఎలాగైన ఉంటాను అనడం. ఇలాంటి లక్షణాలు మీలో ఉంటే మీరు అతి ధైర్యవంతులు, అతి భయస్తులు ఈ రెండు కలసి ఉన్న వాళ్ళే ఇలా ఉంటారు. వీరు విశ్రాంతి సమయములో కుడి శ్వాస, పని అప్పుడు ఎడమ శ్వాస ఉన్న వారు. వారి లక్షణాలు అతి మాటలు, వ్యర్థమైన ఆలోచనలు. మీకు చాలా మంది తారసపడతారు. ఏదో అవ్వాలని ఏదో చెయ్యాలని ఎన్ని చేసినా ఏమీ కాని వారు ఇలా అతి విరుద్ధముగా ఉంటారు.

**భయం:-** అనవసర భయం మనిషిని ఎంత బలహీన పరచునో, అవసరం మేరకు భయం లేకపోతే అది మనిషి పతనమునకు దారి తీయును. పెండ్లి అయ్యే వరకు నీ చూపు, నీ ఆలోచనలు, నీ మాటలు, నీ పనుల వలన నీవు ఎటువంటి సమస్యలు సృష్టించుకొంటున్నావో వాటి వలన నీవు ఎదుర్కొనే సమస్యల గురించిన భయం ఎప్పుడూ ఉండాలి. ఆ భయం నిన్ను సరైన మార్గములో పెట్టును నీ మనస్సుతో నీవు భయపడే భయం కాదు. నీ జీవితం గురించి నీకు భయం ఉండాలి. ఎప్పటికప్పుడు ఈ మాట, ఈ ఆలోచన, ఈ పని నాకు గానీ, నా కుటుంబానికి గానీ, సమాజమునకు గాని ఏమాత్రం ఉపయోగం అనే భయంతో ఉండాలి. నీ ప్రవర్తన, నీ కెరియర్, నీ పనులు, నీ తల్లిదండ్రులు గౌరవానికి ఇబ్బందా? అనేది ఎప్పటికప్పుడు గమనించుకొనే భయం ఉండాలి. పెండ్లి అయ్యాక నీలోని ఏ అంశము వలన నీ భార్యాపిల్లల జీవితాలకు ఇబ్బంది కలగకూడదనే భయం ఉండాలి.

**సమాజ భయం :** మీ చిన్న తప్పు సమాజంపై ఎంత ప్రభావం చూపును అనే భయం ఉండాలి. నీవు వయసులో క్రమశిక్షణగా లేకపోతే మూల్యం చెల్లించాలి అనే భయం ఉండాలి. ఈ రోజు ఇష్టానుసారంగా తిన్నావు, ఆ రోజు ఎలా ఉంది, ఆ రాత్రి నిద్ర ఎలా ఉంది. నీ ఆలోచనలు ఎలా ఉన్నాయి. ఇవి అన్నీ అనుభవం ఉండి మరోసారి ఈపని చెయ్యని భయం ఉండాలి.

బ్రతికి ఉండిందే జీవితం కాదు. మరణం తరువాతి జీవితం గురించిన భయం ఉంటే నీవు ప్రతి అంశాన్ని చక్కగా చేయగలవు.

**భక్తి:-** భక్తి అంటే అద్భుతాలు, మూఢనమ్మకాలు కాదు. నీ ప్రతీ శ్వాసలో భక్తి ఉండాలి. భక్తి అంటే దేవుడు ఒకనిపైనే కాదు నీ జీవితములో ప్రతీ అంశం యందు భక్తి భావం ఉండాలి. నీ వృత్తి, కుటుంబం, సమాజం, దేవుడు, ప్రకృతి ప్రతి అంశం యందు భక్తిభావం కలిగి వుండాలి.

ఆధ్యాత్మికంలో భయము మరియు భక్తి చాలా ముఖ్యాంశాలు. దేవుడియందో, గురువుయందో భయం, భక్తికాదు. మీ జీవితములో ప్రతి అంశములో భయం, భక్తి వుండాలి. నిరంతరం భయం, భక్తి ఉండాలి. సాధనల కంటే భయం, భక్తి మంచి ఫలితాన్ని ఇచ్చును.

**కృతజ్ఞత :-** ఈ సృష్టిలో నీ జీవనానికి కారణమైన ప్రతి అంశం యందు కృతజ్ఞత ఉండాలి. గాలికి, నీరుకి, వృక్షానికి, భూమికి, ఆకాశానికి, దేవునికి అలాగే నీ జీవితములో నీకు ఉపయోగపడిన వారి అందరియందు కృతజ్ఞత ఉండాలి. నీవు ఎంత మంది గురువులు, ఎన్ని గ్రంథాలు చదివిన కృతజ్ఞత లేకపోతే ఉపయోగంలేదు. నీవు దానం చెయ్యడం, చెయ్యకపోవడం నీ ఇష్టం, కృతజ్ఞత దానంకంటే మిన్న.

**ధర్మం:-** నిన్ను నిబద్ధతతో ఉంచేది ధర్మం.

**న్యాయం:-** ఇంకొకరు నీకు చెప్పే వరకు నీకు తెలియనిది న్యాయం.

**చట్టం:-** నీకు శిక్షపడ్డాక తెలిసేది చట్టం.

నీవు ధర్మం నుండి న్యాయానికి, న్యాయం నుండి చట్టమునకు జారి పతనం అవుతున్నావు.

**సిగ్గు :-** తప్పుచేసి బయటపడ్డాక పడేది సిగ్గు.

**లజ్జ:-** తప్పు చెయ్యకముందే పడేది లజ్జ.

# ధ్యానం నాన్నకు సాధనలో వచ్చిన అనుభవాలు

1. ధ్యానములో గాలిలో తేలినట్లు అవ్వడం.
2. గొప్ప ఏకాగ్రత.
3. ధ్యానములో శబ్దాలు వినబడటం, ఏవో ఏవో తెలియడం.
4. ఏవో లోకాలు కనిపించడం.
5. గతకాలం ఋషులు కనిపించడం, వారి అనుభవాలు తెలియడం.
6. గతకాలాల ప్రజల జీవన విధానం తెలియడం, భవిష్యత్ అంశాలు తెలియడం.
7. ధ్యానములో బిందువు కనిపించి ఆ బిందువు రంధ్రం పడి అనంత సూర్యుల కాంతిని దర్శించి, సహస్రారం ద్వారా అనంత విశ్వదర్శనం జరిగి విశ్వాతీత అనుభూతులు కలిగి ఆ విశ్వాతీత శక్తిలో ఐక్యం అవ్వడం జరిగినవి. ఏ అనుభూతికి ఆ అనుభూతి ఆనందం కలిగేది.

   *ఉదా॥ ధ్యానము చేస్తే శరీరం తేలికై దూది పింజంలా ఉండటం చాలా ఆనంద పడ్డాను. ఎన్నో తెలియడం. ఆనంద పడ్డాను ప్రతి అంశం క్రొత్త ఆనందాలు ఇచ్చేది. ఒకదాని కంటే ఒకటి ఆనందం ఇచ్చేది.*
8. నా గత జన్మలు తెలిసినాయి. ఏఏ జన్మలలో ఏమేమి చేశానో ఎందుకు ఈ జన్మకు వచ్చానో, నేను ఈ జన్మలో ఏమి చేయాలో, ఆనందం, ఆశ్చర్యపోయాను అలా తెలియడం.
9. అన్నీ ఆగి జ్ఞానశూన్యం వచ్చినది. ఇప్పుడు ఇంకా గొప్ప ఆనందం. ఏమీ వినిపించడంలేదు. ఏమీ కనిపించడంలేదు. అంతా జ్ఞాన శూన్యం. అబ్బా ఎంత బాగుంది. చూసేది లేదు, వినేది లేదు, చెప్పేది లేదు అని ఆనంద పడ్డాను ఇక అసలుది ఇప్పుడు మొదలైనది.
10. జ్ఞానశూన్యంలో చింతన వచ్చింది. నా బాధలు పోయి ప్రపంచ బాధలు వచ్చినాయి. మనిషిని బాధలు దహిస్తే, చింతన జ్ఞానశూన్యం కలిగించును. నేను ధ్యానం ఇప్పుడు నా ప్రమేయముతో చేయడంలేదు. నా ప్రమేయం లేకుండా, ఎవరో ఒకరు ధ్యానములోకి రావడం. వారి కష్టాల గురించి, వారికోసం చింతనపడటం. జ్ఞానశూన్యంలోకి వెళ్లడం. ఇతరుల కోసం చింతనపడితే శూన్యం వస్తుంది. ఎన్ని దర్శించినా, ఎన్ని విన్నా, ఎన్ని అనుభవాలు వచ్చినా చివరికి ఆధ్యాత్మిక వ్యక్తి చేసేది సమాజం కోసం చింతన.

# ఆధ్యాత్మికం అంటే



"ఆధ్యాత్మికం అంటే అన్నీ తెలుసుకొని ఏమీ తెలియకుండా పోవడమే". నీవే ఏదో ఒక లక్ష్యాన్ని నెత్తికి ఎత్తుకొని నీ శక్తినంతా కేంద్రీకరించి సఫలం చేసినా అది దిగును. లేక అది సాధించకపోయినా ఆ అసంతృప్తి నీ మెదడులో ఉన్నా కాలం అది దిపింతేగాని నీకు ముక్తిలేదు. అది ఏదైనా సరే భౌతికమైనా అంతే ఆధ్యాత్మికమైనా అంతే. భౌతికమైనా, ఆధ్యాత్మికమైనా నీ నెత్తికి ఎక్కించుకున్నది దించుకుంటేగాని నీకు ముక్తిరాదు. నీవు పోయేటప్పటికైనా నీవు ఎక్కించుకున్నవి అన్నీ దించుకోవాలి. చివరికి ఏమిలేదు ఒక మాటలో చెప్పాలంటే మనిషి జీవితం అన్నీ నెత్తిలోకి దూర్చి – మరలా తానే దింపుకోవడమే జీవితం. అది ఏ జీవితమైన సరే – కొందరు భక్తులు వెంకన్నను నెత్తికెక్కించుకొని ఆ వెంకన్నతోనే వుండి 60 వేల కృతులు, కీర్తనలు వ్రాశారు. ఆ 60 వేల కృతులు, కీర్తనలు దించుకున్నాకే ముక్తి.

కొందరు తత్త్వవేత్తలు అదే సమాజ అరాచకాలను నెత్తికెక్కించుకొని వేల పద్యాలు వ్రాసి క్రిందకు దించుకున్నాకే ముక్తిపొందారు. నీవు అన్నీ వదిలి ఆధ్యాత్మికాన్ని నెత్తికెక్కించుకున్న చివరకి దానిని నెత్తినుండి దింపితేగాని నీకు ముక్తిలేదు.

మంచి ఎక్కించుకున్నా అది మెదడు కణాలలో చేరి దానికోసమే నిరంతరం తపించి ఆ లక్ష్యము నెరవేర్చుకుంటాడు. అంటే వాసనలు మంచి అయినా చెడు అయినా మంచి ఎక్కించుకుంటే మంచి కార్యాలు – చెడు అయితే చెడు కార్యాలు

– చెడు కార్యాలవలన ఆ మనిషి మూల్యం చెల్లించాలి. దానితో శిక్షో, కష్టమో, లేక పరివర్తనతోనో ఆ చెడు దిగును. మంచి ఎక్కించుకుంటే ఆ లక్ష్యముతో అది సాధించుకున్నా అది దిగును – ఈ చెడు, మంచి అది దిగేలోపు చాలా ఒత్తిడి వచ్చి ఆ ప్రెజర్ మానవ అవయవాలపై ఏదో ఒక దానిపై ఆ ప్రెజర్‌పడి అనారోగ్యం వచ్చును. బి.పి., షుగర్, కిడ్నీ ఫెయిల్యూర్, అల్సర్, హార్ట్‌ఎటాక్, ఇలా ఏదో ఒకటి. నాకు అన్ని అవయవములు స్ట్రాంగ్‌గా వుండుటవలన ప్రెద్దప్రేగు చివరనపడ్డ గాయంద్వారా ప్రెజర్ రిలీజ్ అయ్యింది. నాకు గాయం ఇన్‌ఫెక్షన్‌లేదు. ఎటువంటి వైరస్ లేదు అన్నారు డాక్టర్స్. ఎవరికైనా ఏదైనా ప్రెజర్ వచ్చి ఆ ప్రెజర్ ఏదైనా అవయవంపై కొడితే ఆ మనిషికి షుగరో, బి.పి.నో, హార్ట్‌ఎటాకో వచ్చిగాని, రోగం వచ్చిగాని ఆ ప్రెజర్ పోవును. ఇది ప్రపంచ ప్రసిద్ధి సైన్సిస్టుల ప్రయోగంలో తేలింది. హోమియో వైద్యం అంతా ఇదే. గుండె జబ్బు వస్తే దానికి మందు ఇవ్వరు. గుండె ప్రెజర్ రావడానికి కారణమైన ఒత్తిడి ఆలోచనకు మందు ఇస్తారు. పవిత్రత అనే ప్రెజర్ చాలా ఉండేది. నావల్ల ఏ తప్పూ జరగకూడదని ఆ మంచితనం ఆ విల్‌పవర్ నాలో వుంది. నాకు భయం, భక్తి ఎక్కువ. జీవితం–భయం, భక్తి; కుటుంబం–భయం, భక్తి, సమాజం–భయం, భక్తి; ప్రకృతి–భయం,భక్తి; వృత్తి – భయం,భక్తి; దేవుడు – భయం,భక్తి చాలా ఎక్కువ. ప్రాణభయం ఒక్కటేలేదు. అన్ని భయాలు వున్నాయి. కావున నావలన ఏ తప్పూ జరగదు. కానీ 2 సంవత్సరాల నుండి నాకు ఒక ఒత్తిడి పెరిగిపోయింది. ఆత్ర వచ్చాక గొప్ప అనుభూతి, గొప్ప సత్యం తెలుసుకున్నాను – పొందుతున్నాను. నా వలన తప్పు జరగకపోయిన ఎవరైనా బలహీనమైన తల్లి మానసిక బలహీనత వలనో లేక ఉనికి కోసమో నాపై నిందవేస్తే నా లక్షా 20 వేల మంది పిల్లలు ఎంత బాధపడతారు. నా భార్యపిల్లలకు ఎంత అవమానం. అన్నింటికంటే నే 45 సంవత్సరాల నుండి ఎన్నో కష్టాలుపడి సాధించిన అనుభూతి, సమాజమునకు ఉపయోగంలేకుండా పోవును అనే ఆ ఒక్క ఒత్తిడి చాలా పెరిగిపోయింది. ఎందుకంటే మనిషికి చాలా బాధలు ఉంటే ఆ చాలా బాధలు పంచుకుంటాయి – కావున ఆ మనిషికి అంత ఒత్తిడి ఉండదు. నాకు అంతకు ముందు క్లాస్ బాగా చెప్పాలి, అందరిచేత బాగా చేయించాలి, నా లక్షా 20 వేలమంది పిల్లలను ఆనందపరచాలి, భార్యాపిల్లలను

ఆనందపరచాలి అనే చాలా ఒత్తిడి ఉండేది. ఉదాహరణకు ఉదయం డబ్బు బాధ, మధ్యాహ్నం అవమానం బాధ, సాయంకాలం ఇంకోబాధ, రాత్రి ఇంకో బాధ ఉంటే ఆ మనిషికి అంత ఒత్తిడి వుండదు.

అన్ని బాధలు దిగిపోయి ఒకే బాధ వుంటే అది చాలా ఒత్తిడి. నాకు అదే జరిగింది. నా పవిత్రతకు భంగం కల్గునేమో అని నే సమాజంలో ఎక్కడ రిలాక్స్‌గా లేకుండా బాగా ఒత్తిడిగా వుండేవాడ్ని. మన క్లాస్ పిల్లలు తప్ప ఇక ఎవరు తల్లులు నా దగ్గర నిలబడినా – నే నిలబడ వలసివచ్చినా చాలా ఒత్తిడి. ఉదా॥ రోడ్డుపైన గాని, బస్సులోగాని, రైల్లోగాని, ఏ షాపుకైనా వెళ్ళవలసివస్తే చాలా ఒత్తిడి ఎలా అంటే ఏ తల్లికైనా నా చేయి పొరపాటున తగిలితే ఆ తల్లి ఏమిటి తగిలింది చెయ్యి అంటే నల్గురు చేరితే ఎంత పరువు తక్కువ – దీనితో నా లక్షా 20 వేల మంది పిల్లలు, నా కుటుంబానికి ఎంత చెడ్డపేరు – ఇంక నే సాధించింది సమాజమునకు అందించకుండా అయిపోవును. 45 సంవత్సరాల కష్టం బూడిదలో పోసిన పన్నీరు అగును అని ఒత్తిడి. అలాగే బస్, ట్రయిన్ అయితే ఎక్కడ తగులుతానో అని నే చేతులు సహజంగా ప్రక్కన పెట్టి నడవడం మానేశాను. రెండు చేతులు కలిపి ముందు పెట్టుకుని నడవడం ఎంత కష్టం. చేతులను సహజంగా ఊగనిచ్చేవాడ్ని కాదు అలాగే కాళ్ళు చాపుకోవడం కూడా చేసేవాణ్ణి కాదు.

ఆ అతి పవిత్రత అనే ఒత్తిడి ఈ గాయంపై కొట్టేసి రిలీఫు అయ్యాను. ఆ గాయం లేకపోతే ఏదో అవయవముపై కోటేసును నా అవయములు స్ట్రాంగ్‌గా వున్నాయి. అందుకు ఆ ఒత్తిడితో ఎవరికి కనిపించకుండా అజ్ఞాతములో వుందాము అనుకునేవాడ్ని. ఈ గాయంవలన రిలీఫ్ అయ్యాను. ఇంతకుముందు ఆ ఒత్తిడి తట్టుకోలేక అజ్ఞాతంగా హిమాలయములకు వెళ్లిపోయేవాడ్ని. ఈ గాయముతో ఇప్పుడు రిలీఫ్ అయ్యింది. ఇప్పుడు అలా వెళ్ళిపోవాలని అనిపించడంలేదు.

మనిషికి రెండు రకాల అంశాలు ఉంటాయి. (1) అవసరాలు (2) కోరికలు. అవసరాలు అనేవి జ్ఞానేంద్రియాలతో పనిలేకుండా స్వతంత్రంగా మెదడుకు సంకేతాలు పంపేవి. ఈ సంకేతాలు మనిషికి తెలియకుండానే జరుగును. అవి (1) గాలి (2) నీరు (3) ఆహారం (4) నిద్ర (5) శారీరక అవసరం ఈ ఐదు అవసరాలు.

కోరికంటే జ్ఞానేంద్రియాల సమాచారం. మెదడును ప్రేరేపించేవి కోరికలు. గాలిని చూసి గాలి పీల్చుకోవాలని అనుకోడు. గాలి శరీరకణజాలకు అవసరం. కాబట్టి నిరంతరం స్వతంత్రంగా జరిగే అంశం – అది ప్రయత్నంగా కాదు. నీరు చూసి నీళ్ళుత్రాగడం కాదు. మీ బాడీలో నీరు అవసరాన్ని శరీరము మెదడుకు పంపే సంకేతం అది అవసరం. ఆకలి – మీ కణజాలలో శక్తి తగ్గగానే మీ జీర్ణాశయంలో ఆమ్లములు ఉత్పత్తి అయి ఆకలికి తినాలని పించి మెదడుకు పంపితే అది అవసరం. ఆహార అవసరంలో రుచి అది కాదు ఇది కావాలి అని ఉండదు.

అదే మీరు ఆహారపదార్థములను చూసి తినాలనిపిస్తే అది కోరిక అవసరం కాదు. పబ్‌సోడా త్రాగాలి అనిపిస్తే అది అవసరం కాదు కోరిక. అది త్రాగేక మీ కడుపు ఎంత కరాబు అగునో ఆ టైమ్‌కు తెలియనివ్వదు మనసు. త్రాగు బాగుంటాది అని చెప్పును. అదే మీకు దాహం అయితే త్రాగేది నీరు. మీరు అలిసిపోతే వచ్చేది నిద్ర అది అవసరం. మందు త్రాగి, పీకదాకతిని నిద్ర తెచ్చుకోవడం కోరిక. అలాగే శారీరక అవసరం. మీలో ఆ గ్రంధి, స్త్రీ పురుష గ్రంథులు చైతన్యం అయితే అది శారీరక అవసరం. అంతేగాని – మీరు మనస్సుతో శారీరక అవసరమును గుర్తుకు తెచ్చుకొని ఆలోచిస్తే అది కోరిక.

100 సమస్యలు సమానంగా వున్నవాడు ఆత్మహత్య చేసుకోడు. ఈ 100 సమస్యల్లో ఒక సమస్య తీవ్రమై మిగతా సమస్యలు బలహీనమైతేనే ఆ ఒక్క సమస్య వల్లనే ఆత్మహత్య చేసుకుంటాడు. ఉదా॥ హైద్రాబాద్‌లో వున్న ఒకరికి కొడుకు డాక్టర్ సీటు, అమ్మాయి పెండ్లి, ఆర్థిక సమస్య, ఒక ప్రాజెక్టు మధ్యలో ఆగింది, తెలంగాణా వచ్చునో, రాదో, తండ్రికి అనారోగ్యం వుంది, తనకూ అనారోగ్యం సమస్య వుంది, అతను అనుకున్న రాజకీయ నాయకుడు తెలంగాణా సి.ఎం. అవ్వాలి, తన పళ్ళు ఎత్తు, జుట్టు తెలుపు ఇన్ని సమస్యలు వుంటే అతను రోజులో ఈ అన్ని సమస్యలకు మారతాడు. కావున ఆత్మహత్య చేసుకోడు. అదే

మిగతావి అన్నీ చిన్నవి అయ్యి బాగా చిన్న సమస్య మిగిలితే అదే పెద్ద సమస్యగా ఆత్మహత్య చేసుకుంటాడు. అన్ని సమస్యలు చిన్నవి అయ్యి, భగవంతుడో లేక పవిత్రతో లేక మంచిగ వుండాలనో లేక ఇంకా ఏదో ఒక్క అంశంతో ఉంటే మైక్రోసాఫ్ట్ సి.ఇ.ఒ. కంటే పెద్ద ఒత్తిడి, 100 కంపెనీల సి.ఇ.ఒ. ల కంటే ఎక్కువ ఒత్తిడి – మంచిగా వుండాలి అనుకోవడం పవిత్రంగా వుండాలి అని అనుకోవడం.

కారు ట్యూబ్ తయారైనప్పుడు ఏ గాలి వుండదు. గాలి ఎక్కించుకొని ప్రయాణంలో రోడ్డు రాపిడి తగిలించుకుంటూ గమ్యము చేరుతూ అదే గాలి బయటకు వచ్చేవరకు ప్రయాణం చేసి చేసి రోడ్డు రాపిడికి రంధ్రంపడి గాలి పోయాకే ఆ ట్యూబ్ యథాస్థితికి వచ్చును. జీవితమైనా అంతే. భూమిపైకి వచ్చేటప్పుడు ఎలాగ ఉన్నామో ఈ భూమి నుండి వెళ్ళేటప్పుడు అలాగే వెళ్ళుతాము. పుట్టుక చావు మధ్య చాలా ఎక్కించుకొని దించుకుంటాం. కొన్ని సాధించినా కొన్ని సాధించకపోయినా కాలమే దింపును. ట్యూబు లీకేజ్‌కాదు ఒకేసారి పగిలిపోయింది.

ట్యూబు లీకేజి రోగం లాంటిది.

ట్యూబు ఒకేసారి బరస్టు అవ్వడం యాక్సిడెంట్‌లో మనిషి మరణం లాంటిది.

# ఆధ్యాత్మికానికి ఎందుకు వెళ్ళతారు

ప్రతి మనిషిలో ప్రకృతిలో ఉన్న సుగుణాలు త్యాగం, తపన, చింతన అణువు అణువున ప్రకృతి మూలశక్తి అనుభవం ఉండును. కానీ గత జన్మ, ఈ జన్మ వాసనల మరుగున పడిపోవును. ఆ వాసనలు తొలగించుకొంటే మనిషి అసలు స్వరూపమైన ఆత్మను, సత్యమును అనుభవించగలడు. సాధన అనే అగ్నిలో శరీరమును, మనస్సును దహిస్తే, మనిషి తన సహజ స్వరూపమైన ఆత్మానుభవ చైతన్యంలో ఉంటాడు. అదే దైవానుభవం.

**ఆధ్యాత్మికం వైపు వెళ్ళినవారు ఈ కారణాల వలన వెళ్ళతారు.**

1. భయం, భక్తి, చింతన.
2. జిజ్ఞాస.
3. ఉనికి, గుర్తింపు.
4. ఆధ్యాత్మికత ముసుగులో అవసరాలు, కోరికలు తీర్చుకోవచ్చు.
5. ఇతరులపై ఆధిపత్యం చేయవచ్చు. మనం ఎవరి అదుపు ఆజ్ఞలో ఉండనవసరంలేదు.
6. ఆరోగ్యం-మన ధర్మాలు పరిపూర్ణంగా నిర్వర్తించవచ్చు.
7. నా మతమును ఉన్నతం చేయాలి.
8. మాయలు, అద్భుతాల ఆకర్షణతో.

ఈ ఎనిమిది అంశాలు ద్వారా ఆధ్యాత్మికంలోకి వెళ్ళతారు.

పై ఎనిమిదింటిలో ఉత్తమ మార్గం భయం, భక్తి, చింతనతో ఆధ్యాత్మికంలోకి వెళ్ళడం.

రమణుడు, క్రీస్తు, బుద్ధుడు, మహావీరుడు ఇలానే వెళ్ళారు.

రెండవ ఉత్తమ మార్గం జిజ్ఞాస స్వామి నారాయణ ఇలా వెళ్ళారు.

మూడవ ఉత్తమ మార్గం ఆరోగ్యం మన ధర్మాలు.

మిగతావి తరువాత స్థానాలు మీరు దేనికోసం వెళుతున్నారో గ్రహించండి.

# వృక్షోక మనిషి జీవనం






చెట్టు పైకి సృష్టి మూలం వైపు నిత్యం చూచును. క్రింది వేర్లు కూడా అడుగునుండి అదే సృష్టిమూలంవైపు చూచును. చెట్టు నిత్యం ఎరుకలో ఉండును. సృష్టి మూలశక్తి నుండి వచ్చిన నేను నీ మూల లక్షణాలైన త్యాగం, అనుభూతి, నిర్మలత్వం, సౌమ్యం, ప్రశాంతత అవే ఈ భూమిపై వెదజల్లి మరలా నీలోకి చేరుతాను అని నిత్యము తన మూలశక్తి వైపే చూస్తూ, మూలశక్తి అనుభూతిని అనుభవిస్తూ ఆ మూలశక్తిని భూమిపై వెదజల్లుతూ, భూమిపై తన ధర్మాలను ఏ స్వార్ధం, ఏ అహంకారం, ఏ వినాశన లక్షణాలు లేకుండ మౌనముగా నిరంతరం నిర్వర్తించును.

మనిషి కూడా అదే సృష్టిమూలశక్తి అయిన పరమాత్మ దైవశక్తి నుండి అంటే జ్ఞానశూన్యం నుండి వచ్చినా, ఆ ఎరుకలో లేకుండా నిరంతరం ఎప్పుడూ ఏదో ఒక స్వార్ధం, అహం, వినాశన లక్షణాలతో, అన్ని వాసనలతో నరకం అనుభవిస్తూ, నే ఈ భువిపై శాశ్వతంగా ఉండిపోవాలని వివిధ రకాల అహంకారాలతో కూడిన కీర్తి, ఉనికి, స్వార్ధం, ఆధిపత్యం, వినాశనాలు చేస్తూ, ఈ భూమే నా శాశ్వత నివాసం అవ్వాలని, తన మూలశక్తి అనుభూతి దైవశక్తిలోకి వెళ్ళలేక, సత్యమైన జ్ఞానశూన్యం నా అసలు నివాసం అని గ్రహించలేక నరకం అనుభవిస్తున్నాడు ఎప్పుడు తన మూలశక్తి సత్యం గ్రహిస్తాడో అప్పుడే ముక్తి. అదే జన్మ సార్ధకత.

# అహం

**మ**నిషికి ఏదో ఒక అహం ఉంటేనే దేనితోనైనా ఉంటాడు, చేస్తాడు – ఏ అహం లేకపోతే మనిషి దేనితోను ఉండలేడు, చెయ్యలేడు. అహం అంటే తప్పుగా భావించరాదు – మనిషి నెత్తిన ఎక్కించుకున్నవే వాసనలు. ఆ వాసనలే అహాలుగా కార్యరూపం అగును.  రమణుడు చెప్పేది నీ అహం నశిస్తేనే సత్యం అనుభవిస్తావు అంటారు – మరి ఆ అహంను ఎలా నశింపచెయ్యాలి. అడిగితే మనస్సుతోనే నశింపచెయ్యాలి అంటారు.  మరి మనస్సు ఉంటేనే అహంకదా? అంటే అవును వజ్రాన్ని వజ్రంతోనే కొయ్యాలి. నీ అహాన్ని నేనెవర్ని అనే ప్రశ్నతోనే కొయ్యాలి అంటారు అంటే నీవు ఎక్కించుకున్న అహాన్ని నీవే దించుకోవాలి అని అది కార్యరూపం చేసినా దిగును – లేక ఆ అహానికి కారణం ఏమిటి అని అన్వేషణ చేసినా దిగును. ఉదా॥ డబ్బులేకపోతే ఈ సమాజములో మన జీవితం కష్టం అని మీరు ఎక్కించుకుని అన్ని ఆలోచనలు ఆపి దానిపై కేంద్రీకరిస్తే డబ్బు ఎలా సంపాదించాలో నీ ప్రతి అణువు రడీ అయ్యి కష్టపడి సాధిస్తావు – సాధించాక నీకు ఏమిలేదు. ఈ డబ్బుతో అవసరాలు తీరునుగాని డబ్బే జీవితం కాదు అని – అలా అని మీరు మెట్ట వేదాంతంతో డబ్బు అవసరంలేదు అంటే అది సోమరి, అసమర్థుడి ఆలోచన. రెండోరకంవారు – ఈ డబ్బు ఎవరికి – ఎందుకు – దేనికి నాకేకదా? నేనంటే ఎవరు అని అన్వేషణ చేసినా మీలో డబ్బు అన్నదే పోవును. మొదటిది సామాన్యులు చెయ్యాలి. రెండోది ఆధ్యాత్మిక వ్యక్తులు చెయ్యాలి.

మీరు డబ్బు సంపాదనకు మీ మనస్సు శరీరమును ఏకత్వంచేసి వృత్తిలో ఏకాగ్రతచేసి అదే జీవితంగాచేసి సంపాదించితే – అది పొందాక ఏమిలేదు అని మనస్సులో వదిలితే కర్మయోగి – అదే ఆధ్యాత్మిక ఋషి – వీటి కారణం ఏమిటీ మూలాలను అన్వేషించి సత్యం అనుభవించడం. ధర్మాలను కుటుంబం, వృత్తి, ఆర్థిక సమాజ ధర్మాలను నెత్తికెక్కించుకుంటే వాటిని సాధించడానికి తపిస్తారు – కొందరు ఆధ్యాత్మికం అని ధర్మాలను నెత్తికెక్కించుకుని వాటితో ఉందరు. లేక సత్యవంతమైన విచారణ చేసి మూలం అనుభవించరు – మీరు అటు అయినా వెళ్ళండి. ఇటు అయినా వెళ్ళి ఏ దారి అనేది మిగతా జన్మవాసనలు బట్టి

ఉంటాయి. మీ గతజన్మలో ధర్మాలు నిర్వర్తించకపోతే మీరు ధర్మాలు వైపే వెళ్ళతారు – మీ ధర్మము గత జన్మలోను ఈ జన్మలోను పరిపూర్ణం అయితే సృష్టిమూల అనుభూతి అన్వేషణ చేస్తారు – అవి మీ వాసనలు బట్టి ఉంటాయి. ఇదే ఉన్నతం అని ఎవరికి చెప్పలేం చెప్పకూడదు.

అందుకే ఆదిశంకరుడు అహం బ్రహ్మాస్మిః అన్నారు. అహమే దైవం. నీమూలం అంటే మూలశక్తి పరమాత్మయే దైవం – ఒక్కొక్కరికి ఒక్కో అహం ఉండును. అలా ఉంటేనే వారు చేస్తారు.

**రకాలు :**

1) డబ్బు అహం
2) కీర్తి అహం
3) వృత్తి అహం
4) తిక్క అహం
5) రూపం అహం
6) ఉనికి అహం
7) పాండిత్య అహం
8) సాధన అహం
9) ఆధ్యాత్మిక అహం

మీరు పైవాటిలో ఏదో ఒక అహం నెత్తికెక్కించుకొని మిగతావాటిని బలహీనపర్చి ఆ ఒక్కదానిని మిగిలిస్తే అదే మీరు అయ్యి సాధించుకుంటారు – ఇక అప్పుడు ఏది ఉండదు – సృష్టిమూల అనుభూతే ఉండును – అదే ఆత్మస్వరూపం – అదే ముక్తి – ఏకత్వం కూడా అహమే – ఆ ఏకత్వంతో సాధించుకున్నాక ఆ అహం దిగును – అప్పుడే ఆనందం – ఎవరైనా ఫలితం వచ్చు వరకు పడ్డ ఏకత్వముతోఉన్నదే ఆనందం. ఫలితం పొందాక ఏమి ఉండదు జ్ఞానశూన్యమే.